# సరికొత్త మనుషులు!

"నమస్కారం డాక్టరుగారూ! నేను గుర్తున్నానాండీ!" అని డాక్టర్ రఘునాథ్ ముందు నవ్వుతూ నిలబడ్డాడు రాజారావు. అతని వెనక ఒక అమ్మాయి కూడా ఉంది బిడియపడుతూ.

డాక్టర్ రఘునాథ్ అతన్ని చూసి "భలేవాడివోయ్, గుర్తు లేకపోవటం ఏమిటి?" అంటూ చేతిలో పుస్తకం బల్లమీద పెట్టి రాజారావు వెనక నిలబడ్డ అమ్మాయిని ప్రత్యేక శ్రద్ధతో చూస్తూ "లోపలికి రండి!" అని మర్యాదగా ఆహ్వానించాడు.

ఆ అమ్మాయి చాలా సిగ్గుపడుతూ పెద్ద సోఫాలో ఒక చివర ఒదిగి కూర్చుంది. రాజారావు ఆమెకి చాలా దగ్గిరిగా కూర్చుని "నాకు పెళ్ళయిందండీ!" అన్నాడు కొంచెం సిగ్గుపడుతూ.

"తెలుస్తూనేవుంది. నీ పెళ్ళికి పిలవకుండా నువ్వే నన్ను మరిచిపోయావు. పైగా గుర్తున్నానా అని నన్నడుగుతున్నావా?"

రాజారావు నవ్వాడు — "ఎవర్నీ పిలవటానికి అవలేదండీ! అసలు శుభలేఖలన్నా వేయించే టైమ్‌లేదు. గభాల్న కుదిరింది సంబంధం."

"గభాల్నా?" అని నవ్వాడు రఘునాథ్. "కట్నం బాగా తీసుకుని అంత గభాల్న ఒప్పేసుకున్నావేమో! అవునా?"

"అదేం కాదండీ! కావాలంటే పెళ్ళికూతుర్నే అడగండి" అంటూ రాజారావు భార్యని చూసి — "వీళ్ళ నాయనమ్మ నడుం నెప్పితో రెండ్రోజులు మంచం ఎక్కి, పిల్ల పెళ్ళి అర్జంటుగా చూడాలని గోలపెట్టిందట. వారం రోజుల్లో లగ్నం పెట్టేశారు. అది తప్పితే దగ్గిర్లో ముహూర్తాలేం లేవని కంగారు పెట్టేశారు. ఈ అందగత్తెని చూసి వాళ్ళ షరతులన్నీ ఒప్పేసుకున్నాను" అని చిలిపిగా చూశాడామెని. ఆ అమ్మాయి సిగ్గుపడి తల వంచేసుకుంది.

అతని మాటల్లో అతిశయం లేదనిపించింది రఘునాథ్‌కి. ఆ అమ్మాయి చూడముచ్చటగానే ఉంది. అర్థంలేని సిగ్గూ, మాటిమాటికీ ఆ ముడుచుకోడం, ఆ అందాన్ని కొంత పాడుచేస్తున్నాయిగానీ, లేకపోతే ఇంకా ఆకర్షణీయంగా కనపడేది.

రాజారావు నవ్వుతూ తన పెళ్ళి, గుళ్ళో ఎంత సింపుల్‌గా అయిపోయిందో, పెళ్ళికి పిలవనందుకు చుట్టాల కందరికీ ఎంతెంత కోపాలొచ్చాయో, తన స్నేహితులు కూడా నిష్ఠూరాలేస్తూ ఎలాంటి ఉత్తరాలు రాశారో, అందరికీ తను ఎలా సంజాయిషీ లిచ్చుకున్నాడో, అవన్నీ తెగ వర్ణించాడు. నిమిష నిమిషానికీ ఆమె వేపు చూస్తూ నవ్వుతూ మాట్లాడాడు. మాటల మధ్య ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె విడిపించుకోవాలని ప్రయత్నించి ఊరుకుంది. అదేమీ అతను గ్రహించలేదు. ఆమె వేళ్ళ స్పర్శతో ఏకాంతంగా ఉన్నంత పరవశంగా అనిపించాడు. తను అలా ప్రవర్తిస్తున్నానన్న జ్ఞానమే అతనికున్నట్టు కనపడలేదు. నవ్వుతూ మాట్లాడుతూ, ఆమెని చూసి ముగ్ధుడౌతూ కనిపించాడు. ఆ అమ్మాయి తన భార్య అయినందుకు అతను ఎంత ఎక్కువ ఆనందిస్తున్నాడో రఘునాథ్‌కి స్పష్టంగా తెలిసింది.

ఆమె పేరు శ్యామల. ఎక్కువ చదువుకోలేదు. పల్లెటూళ్ళో పుట్టి పెరిగింది. పేద కుటుంబం. మేనమామే బాధ్యత తీసుకుని ఆమె పెళ్ళిచేశాడు.

వినటానికి డాక్టర్‌కి ఆసక్తిలేని కబుర్లు కూడా చాలా చెప్పాడు రాజారావు. "చాలా సిగ్గండీ! నోరు విప్పదు" అని ఫిర్యాదు చేశాడు. "మీరు నమ్మరుగానీ ఈ పది రోజుల్లో పది మాటలు కూడా మాట్లాడలేదు. ముత్యాలు రాలతాయేమో!" అని వేళాకోళం చేశాడు.

ఆ అమ్మాయి పెదిమలన్నా కదలనట్టు నవ్వి, సిగ్గుపడి తల తిప్పుకుంది.

"ఫర్వాలేదు లేవోయ్! ఇద్దరి బదులూ నువ్వే మాట్లాడతావుగా!" అన్నాడు రఘునాథ్.

"అన్యాయమండీ! మీరుకూడా అలాగే అంటే ఇక పలుకే బంగారమౌతుంది."

అతని ధోరణి రఘునాథ్‌కి విసుగనిపించింది. ఆ ఆనందం పాడు చెయ్యలేక అతని మాటలన్నీ వింటూ కూర్చున్నాడు.

చివరికి రాజారావు చెప్పింది — ఆమెకి ఒంట్లో బాగుండడం లేదు. ఒకసారి డాక్టర్‌కి చూపించాలని తీసుకొచ్చాడు.

"క్లినిక్‌కి తీసుకు రాకపోయావా?"

"ఒకసారి మిమ్మల్ని అడిగి...."

"అడిగేదేముందోయ్? సాయంత్రం అక్కడికి రండి!" అంటూ లేచాడు రఘునాథ్.

శ్యామల నిలబడి — "నమస్కారం!" అంది నెమ్మదిగా. చేతులు జోడించింది. కళ్ళెత్త లేదు. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయింది బయటికి.

"వెళ్తాను, డాక్టరు గారూ!" అని రాజారావు గబగబా వెళ్ళి శ్యామల చెయ్యి అందుకున్నాడు. ఇద్దరూ అంత దగ్గిరిగా నడిచి వెళ్తుంటే చాలా ముచ్చటగా అనిపించింది.

'కానీ, ఆ అమ్మాయికి రాజారావుని చేసుకోవటం ఇష్టంలేదేమో! లేనట్టే ఉంది. మనసు సరిపెట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్నట్టుంది. ఏమో! తెలీని విషయం గురించి ఆలోచించకూడదు' అనుకుంటూ రఘునాథ్ బల్లమీద పుస్తకం తీసి అలమారులో సర్ది గ్రౌండ్‌లో బంతి ఆడుకుంటూన్న పిల్లల్ని చూస్తూ నించున్నాడు.

సుజాత లోపల్నించి వస్తూ — "ఎవరో వచ్చినట్టున్నారు, ఎవరూ?" అంది.

"రాజారావనీ .... పేషెంట్‌గా తెలుసులే. పెళ్ళయిందట, ఆ అమ్మాయిని తీసుకొచ్చాడు. గభాల్న కుదిరిందట సంబంధం. అతనామాట అనగానే భలే నవ్వొచ్చింది. ఆ లగ్నం తప్పితే దగ్గిర్లో లగ్నాలు లేవట! చాదస్తుల్లా ఉన్నాడు. ఆ అమ్మాయికి ఒకటే సిగ్గు! సరిపోయింది ఇద్దరికీ."

"కొత్తగా పెళ్ళయిన అమ్మాయి కొత్తవాళ్ళ దగ్గిర కొంచెం సిగ్గుపడకుండా ఎలా ఉంటుంది రఘూ?"

"అసలు ఉత్త శరీరాల అందాలు చూసి ఎలా నిర్ణయించుకుంటారు జీవితాలు? అంత మూర్ఖత్వమా?"

సుజాత, భర్తని ప్రేమగా చూస్తూ నవ్వింది — "నీకు అర్థం కాని విషయాలన్నీ మూర్ఖత్వాలేనా?"

"అర్థం కాని దేముంది ఇందులో? కిందటి ఆదివారం ఇద్దరికీ ఒకరంటే ఒకరికి తెలీదు. ఈ ఆదివారం వాళ్ళిద్దరూ భార్యా భర్తలు! జీవిత సహచరులు! ఆహా! ఉత్త అందచందాలు చూసి జీవితాలు ఎలా నిర్ణయించుకుంటారో! మూర్ఖత్వం కాదూ?" అన్నాడు మళ్ళీ.

సుజాత నవ్వింది—"మరి ఏం చూసి నిర్ణయించుకుంటారు? నీకు నచ్చనిదంతా మూర్ఖత్వమే. స్వభావాలు మంచివి అయితే సుఖంగానే బతకొచ్చు."

"నువ్వు మాట్లాడాల్సిన మాటలేనా ఇవి? స్వభావాలు ఎంత మంచివైతే మాత్రం పెళ్ళికి ముందు ఒకరికొకరు కొంచెమైనా తెలియొద్దూ? ఇద్దరిమధ్యా ప్రేమ అనే అనుబంధం ఉండితీరాలి సుజా! జీవితాల్లో ఎలాంటి సమస్యలొచ్చినా, ఎలాంటి కష్టాలొచ్చినా, నిలబడాలంటే, అనురాగంవల్లే ఆ శక్తి వస్తుంది."

సుజాత నవ్వుతూ వింది. రఘు మాటలు ఎప్పటిలాగే నిర్మలంగా వున్నాయి. "రఘూ! ఇందాక బీరువా సర్దుతోంటే, నీ ఉత్తరాలపెట్టె కనపడింది. తీసి కొన్ని చదివాను. అప్పుడప్పుడూ అలాంటి ఉత్తరాలు రాయకూడదూ?"

"అప్పటిలాగ ఏడిపించకుండా జవాబు లిస్తావా మరి?"

"నేను జవాబు లివ్వనప్పుడు మాత్రం నువ్వు రాయలేదా? రోజూ ఓ ఉత్తరం రాసి ఇవ్వాలని మొదటే షరతు పెట్టాల్సింది నేను" అంది నవ్వుతూ సుజాత.

"షరతు పెడితే ఏం చేస్తాను మరి? మందుల చీటీ పుస్తకాలన్నీ ప్రేమలేఖల కోసం ఖర్చు చేసేవాణ్ణి"

★ ★ ★

"ఒంట్లో ఏం బాగ లేదమ్మా? అనారోగ్యం ఏమిటి?" అని డాక్టరు, శ్యామలని ప్రశ్నలు వేశాడు. ఆ అమ్మాయి నోరు విప్పలేదు. ఒక్కసారి కళ్ళెత్తి అయోమయంగా చూసింది. మళ్ళీ తలవంచుకుని మెదలకుండా కూర్చుంది.

"తల నొప్పండీ! నీరసం అండీ! ఆకల్లేదండీ!"

అని రాజారావు ఉత్సాహంగా భార్య అనారోగ్యాన్ని వర్ణించబోయాడు.

డాక్టరు అతని వర్ణన పెడచెవిని పెట్టి "నువ్వు బయటికి వెళ్ళి కూర్చోవోయ్! ఆమే చెవుతుందిలే. అన్నీ కనుక్కుంటాలే" అన్నాడు.

రాజారావు నవ్వుకుంటూ బైటికి వెళ్ళిపోయాడు.

"ఏం ఫర్వాలేదు, ఇప్పుడు చెప్పమ్మా! అసలు ఒంట్లో బాధ ఏమిటి? డాక్టర్ దగ్గిర సిగ్గుపడకూడదు."

ఆ అమ్మాయి లేచి నిలబడి తల వంచుకుంది. మాట్లాడలేదు.

డాక్టర్ నాడి పరీక్షకు ఆమె చెయ్యి అందుకోబోయాడు. అందనివ్వకుండా చటుక్కున చెయ్యి లాక్కుని రెండడుగులు వెనక్కి వేసింది. డాక్టర్ తెల్లబోయి తేరుకునేంతలో శ్యామల గోడవేపు మొహం తిప్పుకుని ఏడవటం మొదలుపెట్టింది. డాక్టర్ అర్థం గాక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు.

ఆమె ఏడుస్తూ చప్పున చేతులు జోడించి నమస్కారం చేస్తూ, "డాక్టరుగారూ! మీకు దణ్ణం పెడతాను. నన్ను రక్షించండి. నా జీవితమంతా మీ చేతుల్లో ఉంది. నా కేదన్నా మందు ఇవ్వండి .... మీరు తప్ప నా కిప్పుడెవరూ దిక్కులేరు. డాక్టర్‌గారూ! నన్ను రక్షించండి" అని సాధ్యమైనంత నిశ్శబ్దంగా ఏడవటానికి ప్రయత్నించింది.

డాక్టర్ తన అనుభవంతో విషయం గ్రహించగలిగాడు. నిర్ఘాంతపోయాడు.

ఆమె నిశ్శబ్దంగా ఏడుస్తూనే ఉంది.

కొంతసేపటికి డాక్టర్ ఆమె చెయ్యి పట్టుకు చూశాడు.

ఆమె, చెయ్యి వెనక్కి లాక్కోలేదు.

"ఎన్నో నెల?" శాంతంగా అడిగాడు.

"మూడు" భయపడుతూ చెప్పింది.

"ఇలాంటి పరిస్థితిలో ఏం చేద్దామని పెళ్ళి చేసుకున్నట్టు?" చికాకుపడుతూ అడిగాడు.

తల వంచుకుని ఏడ్చింది. జవాబు లేదు.

"అసలిది ఎట్లా జరిగింది?" అందామనుకున్నాడు. ఊరుకున్నాడు. ఎట్లా జరిగిందో తనకి అనవసరం. జరిగింది. అంతే.

"రాజారావుకి తెలిస్తే ఏమౌతుంది?"

అదిరిపడింది. మళ్ళీ చేతులెత్తి భగవంతుడికి నమస్కరిస్తున్నట్టు నమస్కారం చేసింది. "వద్దు! డాక్టరుగారూ! ఆయనకి చెప్పకండి. నే నాయన మొహం చూడలేను. మీరే విషమైనా ఇచ్చెయ్యండి, తాగుతాను. అంతేగాని ఆయనకి చెప్పకండి."

డాక్టర్ కొంత అసహనంగా చూశాడు. "ధైర్యంగా ఉండాలి నువ్వు. ఇంత భయపడితే ఎట్లా? ఇప్పటికే పెద్ద పొరపాటు చేశావు. ఇంకా ఇద్దరి మధ్యా ఇలాంటి రహస్యం దాచుకోటం ఎందుకు? నీకేం భయం లేదు. అతనితో నేను మాట్లాడతాను."

శ్యామల వెర్రిచూపు చూస్తూ — "వద్దు, వద్దు డాక్టరుగారూ! నేను మా ఊరెళ్ళిపోతాను. నాకేమీ జబ్బులేదని చెప్పెయ్యండి. ఈ సంగతి మాత్రం చెప్పకండి" అని దీనంగా ప్రాధేయపడింది.

"చూడమ్మా, నేను చెప్పేది శ్రద్ధగా వినాలి. మీ ఊరు వెళ్ళినా ఎబార్షన్‌కి ప్రయత్నించాల్సిందేగా? ఆ పల్లెటూళ్ళో మోటు వైద్యాలెంత ప్రమాదమో తెలుసా? అసలు నాలుగు నెలలు దాటితే ఏ మందులూ పనిచెయ్యవు. ఈ పరిస్థితిలో మంచి డాక్టర్ తప్ప ఎవ్వరూ సహాయం చెయ్యలేరు. మత్తుమందిచ్చి ఆపరేషన్ చేసి గర్భసంచిని క్లీన్ చెయ్యాలి. నీ తరుపున ఎవరైనా సంతకం పెట్టాలి. ఎబార్షన్ చేయించుకోవచ్చని చట్టం వచ్చాక ఈ పద్ధతంతా వచ్చింది. ఏ డాక్టరూ దీన్ని ధిక్కరించకూడదు. ఇదంతా రాజారావుకి తెలీకుండా ఎట్లా అవుతుంది? నా మాట విను. నీ కేం భయంలేదు. నువ్వు మీ ఊరెళ్ళి అక్కడ ఏదో విషమించి .... అప్పుడు సంగతి బయటపడిందంటే, అతను ఇంకా కోపం తెచ్చుకోవచ్చు. నేనే అతనికి నచ్చజెపుతాను."

శ్యామల ఏమీ అనలేకపోయింది. చెంపల మీద నించి కన్నీళ్ళు దారలుగా జారుతోంటే దీనంగా నిలబడింది.

ఆ అమ్మాయిని చూస్తుంటే డాక్టర్ మనసంతా ద్రవించినట్టయింది. "ఫర్వాలేదమ్మా! లోపల గదిలో కూర్చో" అన్నాడు గుమ్మం వేపు చూపిస్తూ.

శ్యామల డాక్టర్‌ని అపనమ్మకంగా చూస్తూ కళ్ళ

నీళ్ళు ఒత్తుకుంటూ వెళ్ళింది.

డాక్టర్ కుర్చీలో వెనక్కి వాలాడు. అతను ఇలాంటి పరిస్థితి ఎన్నడూ ఎదుర్కోలేదు. అనేకసార్లు ఎబార్షన్ కేసులు చేసినా ఇంత రహస్యంగా కాదు. ఆ పిల్లలకు సంబంధించి పెద్దవాళ్ళే వచ్చి మాట్లాడుతూ ఉంటారు. ఇప్పుడీమెకి సంబంధించిన వాడు భర్తే! ఆ భర్తకి తెలిస్తే కొంప మునుగుతుంది!

కానీ, భర్తకి చెప్పి తీరాలి! ఈమె నాటువైద్యానికి పోయిందంటే ప్రాణాలకే ముప్పు!

రాజారావు తనకి నాలుగైదు సంవత్సరాలుగా తెలిసిన వాడు. మంచివాడే. అయినా ఇలాంటి పరిస్థితిలో అతనెలా ప్రవర్తిస్తాడో తను ఊహించలేడు. పాతికేళ్ళన్నా ఉండవతనికి. భార్యచుట్టూ ఏవేవో ఊహలతో తియ్యటి కలలు కంటున్నాడు. ఈ సంగతి వింటే ....? కష్టమే, ఏమైపోతాడో!

ఏవో అబద్ధాలాడి అతనికి చెప్పకుండా పని జరిపిస్తే....? కానీ, ఇంకో రకంగా తెలిసిపోతే? చదువుకున్నవాడు .... తెలివైనవాడు. ఆ మాత్రం గ్రహించలేడా? అసలిది దాగే రహస్యమేనా? అయినా ఎవరికైనా పొరపాట్లు జరగవా? యవ్వనంలో ఆకర్షణలూ, ఆవేశాలూ ఎవరికి తెలియనివి? కానీ, అతను అర్థం చేసుకుంటాడో లేదో! చాదస్తుడు. ఆమెని వదిలేస్తే? ఆమె చాలా భయపడుతోంది. పొమ్మంటే ఏం చేస్తుంది? ఏ ఆత్మహత్యో....! అబ్బ! ఎలా తేలుతుందిది? — ఏదో ఒకటి సాధించాలన్న పట్టుదలతో డాక్టర్ తొందరగా తేల్చుకుని రాజారావుకోసం కబురు పంపాడు.

రాజారావు చాలా సేపట్నించి కాచుక్కూర్చున్నట్టు ఆతృతగా లోపలికొచ్చాడు. నవ్వుతూనే ఉన్నాడు. శ్యామలకోసం ఇటూ అటూ చూశాడు.

"ఇట్లా కూర్చోవోయ్!" అంటూ డాక్టర్ తన దగ్గిర కుర్చీ చూపించాడు.

రాజారావు కూర్చుంటూ "శ్యామలేదీ?" అన్నాడు.

"లోపలుంది. తీరిగ్గా మాట్లాడుకోవచ్చని కొంచెం ఆలస్యం చేశాను నీ విషయం."

"ఫర్వాలేదండీ! ఏం జబ్బండీ?"

"అబ్బే! జబ్బేంలేదు. బాగానే వుంది."

ఏదో పెద్దభారం దిగిపోయినట్టు అతను తేలికపడుతూ "అవునులెండి. జబ్బేముంటుంది? అస్తమానూ తలనొప్పి అంటూ ఉంటుందంతే" అన్నాడు నవ్వుతూ.

అతని మొహం చూస్తోంటే ఏం చెయ్యాలో డాక్టర్‌కి మళ్ళీ కొత్తగా ఆలోచన మొదలైంది. అంతలోనే నవ్వుతూ చనువుగా "తలనొప్పి కేం, అదే పోతుందిగాని .... అసలు మీ ఆవిడ నిన్ను చూసి భయపడుతోందోయ్!" అన్నాడు.

రాజారావు సిగ్గుపడి — "ఛ! అదేం లేదండీ ...." అని నవ్వాడు.

".... అదంతా సిగ్గనుకుంటున్నావుగానీ, తన మనసులో మాట నీకు చెపితే నువ్వేం అపార్థం చేసుకుంటావోనని అలా ముభావంగా ప్రవర్తిస్తోంది."

రాజారావు చిరాకుపడి — "ఛ ఛ! నేను తనని అపార్థం చేసుకుంటానా? ఉఁహూ! ఆమెకలాంటి సందేహం ఏమీ లేదు" అన్నాడు నమ్మకంగా.

"నువ్వింత ధీమాగా చెపుతున్నావు. మరి నీకు చెప్పకుండా ఎందుకంత బాధ పడుతోంది?"

"బాధపడుతోందా? ఎందుకు?"

"భార్య తన రహస్యం తనలోనే దాచుకుందంటే, ఆమెకి తన దగ్గిర అంత చనువూ, ధైర్యమూ ఆ భర్త ఇవ్వలేదనేగా అర్థం?"

"నిజమే. కానీ నేనూ అలాగ చేశానా?"

"నువ్వు నాకు బాగానే తెలుసు, రాజారావ్! ఎంతో మంది కుర్రాళ్ళకన్నా నువ్వు చాలా విశాలంగా ఆలోచిస్తావని అనుకుంటూ ఉంటాను. కానీ ఏదన్నా ఒక చికాకు సమస్య వచ్చిపడితే ఏం చేస్తావో నాకు సరిగ్గా తెలీదనుకో."

"అసలేమైంది డాక్టరుగారూ? ఏం జబ్బు? ఎలాంటి జబ్బయినా నేను నయం చేయించుకుంటాను."

"అబ్బే! ఏదో ముంచుకొచ్చిందని కాదు. తెల్లారి లేస్తే ఇలాంటి కేసుల్లో ఎంతో మంది ఆడవాళ్ళనీ, మగవాళ్ళనీ చూస్తూనే వుంటాం. కానీ ఆడవాళ్ళ దురదృష్టం. దొరికిపోతారు."

రాజారావు గ్రహించే స్థితిలో లేడు. భార్య కేదో కేన్సర్ లాంటిదో, కుష్ఠు లాంటిదో .... భయంకరమైన జబ్బేదో వచ్చిందని అనుమానం ప్రారంభమైంది. "ఏం

జబ్బు, డాక్టర్? నిజం చెప్పండి. ఫరవాలేదు. నే నేమీ బాధపడను. ఎంత కష్టమైనా వైద్యం చేయిస్తాను" అన్నాడు ఆవేశంగా.

"అవును. బాధపడడం కాదు మనమిప్పుడు చేయాల్సింది. ఏముంది ఇందులో? ఈజీగా తీసు కోవాలి. ఎంత షాక్ కలిగించే పరిస్థితిలో అయినా సరే మనం బ్యాలెన్స్ తప్పకూడదు. రాజారావ్! శ్యామల కసలు జబ్బేంకాదు. చాలా ఆరోగ్యంగా ఉంది. ఆమె కిప్పుడు మూడో నెల కడుపు." టేబుల్ మీద ఏవో కాయితాలు సర్దే నెపంతో డాక్టర్ మొహం తిప్పు కున్నాడు.

రాజారావు స్తంభించిపోయాడు. కాస్సేపు వెర్రి చూపు చూశాడు. తను ఊహించినంత భయంకరమైన జబ్బేదీ రానందుకు ఒక్క క్షణం అతని కళ్ళు కాంతిగా వెలిగి, జీవరహితం అయ్యాయి. క్రమంగా అతని చూపులు తీక్షణంగా మారి మొహం జేవురించింది. కోపంతో కంపించిపోయాడు.

డాక్టరు సాధ్యమైనంత అనునయంగా, ప్రాణ మిత్రుణ్ణి ప్రేమతో ఓదార్చినట్టు "బాధపడకు రాజా రావ్" అన్నాడు.

రాజారావు తల వంచేసుకున్నాడు.

"నీకు చెప్పవద్దని ఆమె చాలా ఏడ్చింది. కానీ దానివల్ల పరిస్థితి ఇంకా విషమిస్తుంది ...."

"ఛీ, ఛీ! నాకెందుకు చెప్పారు డాక్టర్? అసలీ సంగతి నాకు తెలీకపోతే ఎంత బాగుండేది!" అని విరుచుకుపడ్డాడు రాజారావు.

"తొందరపడకు, శాంతంగా ఆలోచించు. జీవితం అంటే హాయిగా, సాఫీగా బ్రతికెయ్యటం కాదు, సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడాలి."

రాజారావు కోపంతో తల అడ్డంగా తిప్పాడు — "నా వశం కాదు, నా వశం కాదు. ఇంత అసహ్యమైన సమస్య వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు" అన్నాడు. అతని కోపం క్షణక్షణానికీ ఇనుమడించింది. "వాళ్ళంతా అంత తొందరపడి పెళ్ళి చెయ్యటానికి ఇదన్నమాట కారణం! ఎంత సాహసం, డాక్టర్! ఇంత గుండెల్దీసిన మనుషులుంటారని నా ఊహకి కూడా అందలేదు. ఛీ, ఛీ! నన్నెంత మోసం చేశారు! .... ఆమెకూడా ...." ఇక మాట్లాడలేక పోయాడు.

" 'మోసం' అని నీ కనిపిస్తుంది గానీ, అది నిజం కాదు. ఆ మోసం నిజంగా ఆ అమ్మాయినే ఎవరో చేసివుంటారు. ఏదో నిస్సహాయ స్థితిలోపడి ఉంటుంది. అసలు సంగతేమిటో మనకి తెలీదు. కొంచెం సానుభూతితో ఆలోచించాలి."

"సానుభూతి! ఎవరిమీద?" మండిపడ్డాడు రాజా రావు. "నన్నింత మోసంచేసిన మనిషిమీదా? ఏదో మామూలు విషయం అయితే నేనూ ఆలోచించే వాణ్ణే. భరించేవాణ్ణే. తనకే కష్టం వచ్చినా నా ప్రాణసమానంగా చూసుకునేవాణ్ణే. కానీ .... ఇలాంటి ఘోర సమస్య నా మీద విరుచుకుపడితే నేనేం మానవాతీతుణ్ణా డాక్టర్‌గారూ, చలించకుండా ఉండడానికి?"

"మానవాతీతులంటే ఎవరు? ఈ చాదస్తాలన్నిటికీ అతీతంగా మనమే ప్రవర్తించకూడదా?"

"చాదస్తమా ఇది?" నిర్ఘాంతపోయాడు రాజా రావు. డాక్టర్ మీద అతనికి చాలా కోపం వచ్చింది. "పెళ్ళిచేసుకున్న పన్నెండో రోజున భార్యకి మూడు నెలల కడుపు అని విని అసహ్యించుకోవటం చాదస్తం అంటారా మీరు!"

డాక్టరు, కుర్చీలో వెనక్కివాలి నిర్లక్ష్యంగా అన్నాడు —"నా దృష్టికి చాదస్తమే. ఆ సందర్భంలో ఉన్న నిజా నిజాల్నిబట్టి చూడాలిగానీ, అసలేం జరిగిందో తెలియ కుండా 'మోసం' అని తేల్చేస్తే ఎలాగ? 'నీతి నియ మాల' సంగతి అలా వుంచి ఒక ఆడపిల్లకి వచ్చిన కష్టం గురించి ఆలోచించు! మనిషిలోపల ఎన్ని బలహీనతలు! మనిషి చుట్టూ ఎన్ని విషవలయాలు! ఇష్టంగానో, అయిష్టంగానో మనం, ఎన్నో 'పొరపాట్లు' చేస్తూవుంటాం. దిద్దుకునే అవకాశం లేకపోతే, ఇవ్వక పోతే, మనిషి ఏమైపోవాలి?"

రాజారావు కోపంతో మండిపడుతూ — "ఇది మామూలు పొరపాటా?" అని అరిచాడు.

"ఇంత తెలివితక్కువ స్థితి తెచ్చుకోవటం పొర పాటు కాకపోతే ఏమిటి? ఆ అమ్మాయికీ పరిస్థితి ఎలా వచ్చిందోగానీ విపరీతంగా భయపడిపోతోంది. ఆమె సంగతి ఆలోచించి చూడు!"

రాజారావు డాక్టర్ని ఆశ్చర్యంగా చూశాడు — "పెళ్ళికాకుండానే చెడుతిరుగుళ్ళు తిరిగేసి, నన్నింత దగాచేసిన మనిషి గురించి నేను ఆలోచించాలా?"

"చెడు తిరుగుళ్ళు — అనకు రాజారావ్! అసలేం జరిగిందో నీకు తెలీదుకదా?

"ఇంకా తెలిసేదేమిటండీ?" డాక్టరుగారూ?" రాజారావు డాక్టర్ని వింతగా చూశాడు "పెళ్ళికాకుండానే తిరగొచ్చంటారా? పిల్లల్ని కనొచ్చంటారా? సరే, తిరగ మనండి, కనమనండి! మధ్యలో నా జీవితం ధ్వంసం చెయ్యడం ఎందుకు?"

"పెళ్ళవగానే పిల్లల్ని కనడానికి అర్హత వస్తుందను కుంటున్నావా? ఇద్దరి ఆరోగ్యాలూ, ఆర్థిక స్తోమతూ, పిల్లల్ని పెంచే జ్ఞానం, ఎన్ని వుండాలి! తను ఎక్కడ నిలబడాలో ఆధారం లేకుండానే, అలాంటి తల్లి, పిల్లల్ని కనొచ్చని నేనెలా అంటాను? పిరికిప్రియుల్ని నమ్ముకుని, మోసపోయి, లోకంతో హేళనలూ వెక్కి రింతలూ పడే దుర్భరస్తితి ఏ ఆడపిల్లా తెచ్చుకోకూడ దనే నేనంటాను.

అసలు పెళ్ళికాకుండా ప్రియుల్ని నమ్ముకునే ఆడపిల్లలు, పిల్లల కోసమే అలా చేస్తారనుకుంటు న్నావా యేమిటి? ప్రకృతి వాళ్ళని ఆ సమస్యలో పడేస్తుంది. తీరా ప్రమాదంలో పడ్డామని తెలిశాక, ఆ పిల్లల్ని పెరగనివ్వకుండా వాళ్ళ రూపు రేఖల్ని తుడిచి పెట్టాలని ఎన్ని ఘోర ప్రయత్నాలు చెయ్యాలో అన్నీ చేస్తారు. అన్నీ విఫలమైనప్పుడే నిస్సహాయంగా ఆ బిడ్డని కంటారు. సంఘానికే కాదు, కన్నతల్లికి కూడా ఇష్టంలేని స్థితిలో పుడతారు ఆ బిడ్డలు. పుట్టీ పుట్టగానే ఏ కాలవగట్టునో, ఏ తుక్కు డబ్బాలోనో, ప్రాణాలు విడుస్తారు. ఇలాంటి రాక్షసాలెన్నయినా చూసి సహిస్తాం గానీ, మన నీతి నియమాల్లో అవసరమై నప్పుడు చిన్న మార్పు చేసుకోలేం. ఆపదలో ఉన్న మనుషుల్ని వదిలి, మన నీతుల్నే అచంచలంగా కాపాడుకుంటాం."

డాక్టర్ మాటలకి రాజారావు అసహనం ఎక్కువై పోయింది. "మీ రెక్కడో, ఏ దేశంలోనో ఉన్నట్టు మాట్లాడుతున్నారు. ఈ దేశంలో పుట్టిపెరిగే మనుషు లెవరూ దీన్ని భరించలేరు."

"చూడు నాయనా! కన్న కూతుళ్ళని బలాత్కరించే తండ్రులూ, చెల్లెళ్ళతో సంబంధాలు పెట్టుకునే అన్నలూ, అమాయకపు ఆడపిల్లల్ని వంచించే బావలూ మేనమామలూ పినతండ్రులూ, వీళ్ళంతా ఎక్కడ పుట్టి ఇక్కడ కొచ్చారంటావు? ఈ 'పవిత్ర' దేశంలో పుట్టి పెరిగేవాళ్ళే. చదువు కోడానికొచ్చే ఆడపిల్లల్ని ఆశించే టీచర్లూ, ఉద్యోగాలకొచ్చే స్త్రీలని ఇబ్బందిపెట్టే ఆఫీసర్లూ, ఎక్కడ వీలైతే అక్కడ తమ నీచత్వం ప్రద ర్శించే ప్రబుద్ధులంతా, ఏ దేశంలో పుట్టి భారత దేశానికొచ్చారు? పెళ్ళికాని పిల్లల్ని తల్లుల్ని చేసే ఇంత మంది పురుషోత్తములున్న నీ భారతదేశంలో ఇంకా 'పవిత్రత' ఎక్కడుంది? మనుషుల్ని వదిలి, హిమా లయాల్లోనో గంగా నదుల్లోనో దాక్కుంది నీ సంస్కృతి. భారతదేశం గొప్పలు చెప్పుకుని గర్వపడి ప్రయోజనం లేదు. ఈ దేశంలోనే పుట్టి పెరిగిన ఒక భారతీయుడి మోసానికి బలైందేమో ఈ అమ్మాయి, ఎవరికి తెలుసు? జరిగిందానికి సిగ్గుపడి నీకు మొహం చూపించలేక దీనంగా ఏడుస్తోంది. పెళ్ళికి ముందే అంతా చక్కబరిచి పెళ్ళిచేసి ఉంటే, నీ భార్య ఎంతో సౌశీల్యవతి అని గర్వపడే వాడివి. నిజం తెలియకుండా దాచగలిగితే చాలు. అలాంటి విశేషాలు ఎన్ని జరగటం లేదు మన కుటుంబాల్లో?"

"ఎక్కడో ఏదో జరిగిందని నా జీవితంలో దీన్ని నేనెలా సరిపెట్టుకుంటాను? నా బాధ మీ కేమీ అర్థం కావడంలేదు. నేనే ఈ పెళ్ళికి ముందు చెడు తిరు గుళ్ళు తిరిగి, ఒక బిడ్డనికని, ఆమెని వదిలేసి ఈమెని పెళ్ళి చేసుకుని వుంటే, అప్పుడు మీరు నా గురించి ఇంత సానుభూతితో ఆలోచిస్తారా?"

"ఎందుకాలోచిస్తాను? మొగవాళ్ళ గురించి అలా ఆలోచించవలసిన అవసరం లేదు. ఈ పెళ్ళిళ్ళ విష యాల్లో, మొగాళ్ళు, మోసాలు చెయ్యవచ్చుగానీ మోసాలకు గురయ్యే స్థితిలో వుండరు. నాకు తెలిసిన ఒక డాక్టరు, ఒక నర్సుని నమ్మించి కొంత కాలం గడిపాడు. ఒక ఆడపిల్లకూడా పుట్టింది. తర్వాత పెద్ద కట్నంతో ఇంకో అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. ఇక్కడ, ఈ డాక్టరే నర్సుని మోసం చేశాడుగానీ, ఆ అమ్మాయి డాక్టర్ని మోసం చెయ్యలేదు. ఆ డాక్టరు, ఆ అమ్మాయిని మోసం చెయ్యకూడదనుకుంటే, ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకోగలడు. అది అతని చేతిలో పని. ఇంకే కేసైనా తీసుకో! ఈ పెళ్ళిళ్ళ విషయాల్లో, మొగపిల్లలే ఆడపిల్లల్ని మోసాలు చేస్తారు. అలాం టప్పుడు, మోసం చేసేవాళ్ళ మీదకూడా సానుభూతిగా

వుండాలంటావా? రాజారావ్! శ్యామల వున్న పరిస్థితిలో నువ్వెలా వుంటావు? చెయ్యదల్చుకుంటే నువ్వే మోసం చెయ్యాలిగానీ, నీకు మోసం జరగదు. కాబట్టి, శ్యామల పరిస్థితి అర్థం చేసుకోడానికి ప్రయత్నించు. నేను చెప్పిన నర్సు మీద జాలికలిగినట్టే, శ్యామల మీదకూడా నీకు జాలి కలగాలి."

రాజారావు కోపంగా తల అడ్డంగా తిప్పాడు. "మీరెన్ని చెప్పండి డాక్టరు గారూ! ఇదంతా భరించటం నా వశం కాదు. నా జీవితం సర్వనాశనం అయిపోయింది. బాధపడకుండా ఉండేంత శక్తిలేదు నాకు" అని నుదురుపట్టుకున్నాడు.

డాక్టర్ కొంతసేపు మౌనంగా ఊరుకుని నెమ్మదిగా అన్నాడు. "సమయం వస్తేగానీ ఎవరు ఎంత శక్తివంతులో తెలీదు. మనిషికి ప్రాణాన్ని మించిన ఆశ ఏదైనా వుంటుందా? అలాంటి ప్రాణాల్నే ఎందరో మనుషులు తమ ఆశయాలకోసం సునాయాసంగా సమర్పిస్తారు! ఏ శక్తులున్నాయి వాళ్ళకి? అలాంటి త్యాగాలు చెయ్యగలిగే మనిషికి ఇది ఒక సమస్యా?"

"దానికీ, దీనికీ పోలిక పెట్టకండి! అవసరమైతే ప్రాణ త్యాగాలు చెయ్యటానికి సిద్ధపడే దేశ భక్తుడైనా, విప్లవకారుడైనా. తన భార్య శీలవతికాదని తెలిస్తే, సహించలేడు. భరించలేడు."

"అదే నిజమైతే అతను దేశభక్తుడూ కాడు, విప్లవకారుడూ కాడు. సాటి వ్యక్తిపట్ల సానుభూతి లేనివాడికి దేశం ఎక్కడుంది? న్యాయాన్యాయాలు చూడకుండా స్త్రీ శీలానికి హద్దులు పెట్టేవాడికి విప్లవం ఎక్కడుంది? అలాంటి అబద్ధపు త్యాగాలకోసం నిన్ను నేను ప్రోత్సహించటం లేదు. భార్యల శీలాల గురించి మనం చెప్పుకునే అర్థాలు చాలా తొందరగా మార్చుకోవాలి. పురుషులు ఎంత శీలవంతులో స్త్రీలు అడగలేరు కదా?"

రాజారావు గాయపడ్డట్టు చూశాడు — "నేను నిప్పులాంటి వాడిని. ఆ విషయంలో నన్నెవరూ తప్పుపట్టలేరు."

"కావచ్చు రాజారావ్! దానికి రుజువేమిటి? నువ్వు చెప్పింది నమ్మవలిసిందేకదా? అంతకన్నా రుజువు లేదు కదా? కానీ, ఆడవాళ్ళ విషయంలో చూడు, వాళ్ళ సంగతులన్నీ బయటపడిపోతాయి. మొగవాళ్ళు తప్పుకోగలుగుతారు. వాళ్ళు ఎంత శీలవంతులో కాదో ఎలా నిర్ణయిస్తాం? అందుకే స్త్రీల విషయంలో కొంచెం శాంతంగా ఆలోచించాలంటున్నాను."

రాజారావు విచారంతో కుంగిపోతూ తలవాల్చేశాడు — "తలుచుకుంటేనే అసహ్యం వేస్తోంది. మా జీవితం ఎలా ఉండాలని కోరుకున్నాను! నేను ఆమెకోసం బ్రతకాలి, ఆమె నా కోసం బ్రతకాలి — అనుకున్నాను. నా భార్య జీవితంలో నా కన్నా ముందు ఇంకో వ్యక్తి ఉన్నాడనుకుంటే .... ఆ ఊహే భరించలేకపోతున్నాను" అని తల ఝాడించాడు.

"నిజమే. అ నిజం దుర్భరంగానే ఉంటుంది. కానీ ఆ నిజం ఇప్పుడు అబద్ధమైపోయింది కదా? అప్పటికీ ఇప్పటికీ, ఆమె మానసిక స్థితి చాలా మారి ఉంటుంది. ఆమెని మోసం చేసిన ఆ వ్యక్తిమీద ఆమెకి ఎప్పుడో అసహ్యం కలిగి వుంటుంది. ఇంకా ఆ గతంతో ఏం పని? మీ ఇద్దరి మధ్యా అనుబంధం బలపడితే, ఆమె జీవితంలో ఎల్లకాలం నిల్చేది నువ్వే! మీ సంసారం నువ్వు కోరుకున్నంత సంతోషంగానూ వుంటుంది. గతాన్ని వదిలెయ్యి! ఎబార్షన్ చేసేస్తాను. ఆ పాత చరిత్రంతా పోతుంది...."

రాజారావు చీదరించుకున్నట్టు మాట్లాడకుండా మొహం చిట్లించాడు.

"రాజారావ్! నిన్ను ఒప్పించటానికి నేనిలా మాట్లాడుతున్నాననుకోకు. ఇలాంటి సమస్య రాని వాళ్ళు కూడా ఇదంతా ఆలోచించాలి. నీ స్నేహితుడికే ఈ సమస్య వస్తే నువ్వేం చెపుతావు? 'ఆమెని వొదిలెయ్యి' అని చెపుతావా? .... ఈ రోజుల్లో ఆడామగా కలిసి చదువుకుంటున్నారు. కలిసి ఉద్యోగాలు చేస్తున్నారు. ఆడపిల్లల విషయంలో తెలివి తక్కువతనాలూ, మొగపిల్లల విషయంలో మోసాలూ!.... ఇలాంటి సంఘటనలు తారసపడుతూనే వున్నాయి. డాక్టర్లం ఇలాంటి కేసులు చేస్తూనే వున్నాం.".

రాను రానూ రాజారావుకి, డాక్టర్ మాటలు వినడం దుర్భరం అయిపోయింది. కణతలు నొక్కుకుంటూ "నా భార్య అనుకున్న క్షణంనుంచీ ఆమెని నేనెంత ప్రేమించానో మీకు తెలీదు!" అన్నాడు. అతని కంఠస్వరం భారమైపోయింది.

"ఈ పన్నెండు రోజుల్లోనేనా?" డాక్టర్ నవ్వాడు.

వెటకారం ధ్వనించింది.

"పన్నెండు రోజుల్లో కాదు, పన్నెండు గంటల్లోనే ఆమె నా సర్వస్వం అయిపోయింది."

డాక్టర్‌కి విసుగొచ్చి కుర్చీలోంచి లేచాడు. "అంత ప్రేమించిన వాడివి ఈ విషయం గురించి ఇంత రాద్ధాంతం చేస్తావెందుకు? ఆమెని క్షమించవచ్చు కదా?"

"అది నాకు చాతకాదు."

"ఆమె దుఃఖపడటం నీ కిష్టమేనా?"

"దానికి నా బాధ్యతేం లేదు."

"నీ నిర్ణయంతో ఇటో అటో జరిగే విషయానికి నీకు బాధ్యత లేకపోతే ఎవరికుంది రాజారావ్? నువ్వెంతో ప్రేమించా ననుకుంటున్నావు. కాస్త మోటుగా చెప్పాలంటే, అదంతా కొత్త మోజు. భార్యా భర్తల్ని సన్నిహితం చేసేది సెక్సు సంబంధాలే అనుకోకు. అడుగడుగునా స్నేహానికీ, త్యాగాలకీ కూడా జీవితం అవకాశమిస్తుంది. నీ ప్రేమకే పరీక్ష వచ్చింది అనుకోలేవా?"

"నా ప్రేమ ఇలాంటి నీతీ నిజాయితీ లేని పరీక్షల కోసం కాదు. ఇలాంటి తిరుగుబోతుల్ని నెత్తికెక్కించుకోడానికి కాదు."

డాక్టర్ చాలా నిరుత్సాహపడ్డాడు. రెండు నిమిషాలు ఊరుకుని — "అయితే నువ్విప్పుడేం నిర్ణయించుకున్నట్టు?" అన్నాడు.

"ఆమెని వాళ్ళ ఊరు పంపించేస్తాను. నేనింత విషం తాగి చచ్చిపోతాను. ఇది నా మనసు ఎప్పుడో నిర్ణయించేసింది?"

డాక్టర్ అదిరిపడ్డాడు. "వొద్దు, వొద్దు, రాజారావ్! తొందరపడకు. నీ భార్యతో నువ్వీ పది రోజులూ ఎంత మధురంగా గడిపావో మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం తెచ్చుకో. ఆవేశంతో జరిగే హత్యలూ, ఆత్మహత్యలూ మనకి కొత్తకాదు. జీవితం తెచ్చే సమస్యలకి పరిష్కారం చావు కాదు. నేనే నీ స్థానంలో ఉంటే ...."

రాజారావు విసురుగా లేచాడు — "మీతో నన్ను పోల్చకండి డాక్టరుగారూ! నేను నేనే, మీరు మీరే! నేను మీరెలా అవుతాను?"

"అయితే ఈ సంగతి నీకు చెప్పి చాలా తప్పు చేశాను. నువ్వు అర్థం చేసుకుంటావనుకున్నాను చాలా తొందరపడ్డాను. నిన్ను ఒప్పించగల ననుకున్నాను. అందుకే నీకు చెప్పాను."

"అందుకు మాత్రం మీకు చాలా కృతజ్ఞుణ్ణి! నాకు చెప్పలేనంత మేలు చేశారు."

శ్యామల పక్క గదిలోంచి చాలా మాటలు వింది. చివరకి కళ్ళు తుడుచుకుని వచ్చి గోడవైపు తిరిగి నిలబడింది.

ఆమెకెంతో అన్యాయం చేసినట్టు ఆమె మొహం చూడటానికి చాలా సిగ్గు పడ్డాడు డాక్టర్.

రాజారావు గదిలోంచి బయటికి వెళ్ళిపోయాడు. శ్యామల అతని వెనక నెమ్మదిగా నడిచింది. ఆమె వరండా మెట్లు దిగుతూంటే అతను కాంపౌండ్ గేటు దాటేశాడు.

డాక్టరు దోషిలాగ నిలబడి పోయాడు.

★ ★ ★

వెన్నెల మసక మసగ్గా ఉంది. ఆకాశం నిండా మబ్బులు చంద్రుణ్ణి చిన్న వాణ్ణి చేసి క్షణానికోసారి పొట్టన పెట్టుకుంటున్నాయి. రఘునాథ్, ఇంటి ముందు పచ్చికలో కూర్చుని ఆకాశంకేసి చూస్తున్నాడు. మబ్బుల్లో పడి చంద్రుడు మాయమైనప్పుడల్లా అతని ప్రాణం కొట్టుకుంటోంది. అతనికి ప్రతీక్షణం శ్యామల గుర్తొస్తోంది. గుర్తురావడంకాదు, వాళ్ళు వెళ్ళిపోయి నప్పటినించీ వాళ్ళని మరిచిపోనేలేదు.

"చాలా పొరపాటు చేశాను సుజా!" అన్నాడు భార్యతో ఎన్నోసార్లు. ఆరాత్రి భోజనంకూడా చాలా అనాసక్తంగా చేశాడు. శ్యామలకి ఇష్టంలేకుండా ఆమె సంగతి రాజారావుకి చెప్పటం చాలా తప్పని ఎప్పుడో అర్థమైంది.

"ఏమిటి? అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? శ్యామల సంగతేనా?" అంది సుజాత. ఆమె ఎప్పు డొచ్చిందో కూడా అతను గమనించలేదు.

"ఇంకేముంది? నేను చేసిన ఘనకార్యం గురించి తీరిగ్గా పశ్చాత్తాపపడుతున్నాను" అన్నాడతను విచారంగా.

"అతని కెందుకు చెప్పావు తొందరపడి?"

"ఎలాగైనా ఒప్పించగల ననుకున్నాను సుజా!" అన్నాడు రఘునాథ్ దోషిలాగ — ఎప్పుడూ చాలా

మంచిమాటలు మాట్లాడేవాడు. కమ్యూనిస్టు ననేవాడు. ఇంత మూర్ఖుడనుకోలేదు"

"ఏ ఇస్టు అయినా ఇలాంటి విషయంలో ఒకటే."

"అంతేనా? మనుషు లెప్పుడూ ఇంత సంకుచితం గానే వుంటారా?"

ఇద్దరూ నిస్సహాయుల్లాగ మౌనంగా కూర్చున్నారు. రఘునాథ్, ఆ నిశ్శబ్దాన్ని భరించలేనంత అశాంతితో — "ఆ అమ్మాయినేం కొట్టీ తిట్టీ హింసిస్తున్నాడో దరిద్రుడు. ఇక ఏ డాక్టరూ ఎబార్షన్ చెయ్యక్కర్లేదు. అతనే చంపి ఏ నూతిలోనో పారేస్తాడు. ఎన్ని కేసులు ఇలాంటివి! అన్నీ తెలిసి తెలిసి నేనీపని చేశాను. అదే నా బాధంతా" అని తల పట్టుకున్నాడు. "నేనే ఏదో అబద్ధమాడి ఆమె రహస్యం బయటపడకుండా చేసేస్తే ఎంత బాగుండేది! భయంతో నాకు నమస్కారం పెట్టి రక్షించమని ఏడ్చింది. అలాంటి పిల్లని రాక్షసంగా ఆ భర్తకే అప్పగించాను."

సుజాత, భర్తని కొత్త వ్యక్తిని చూసినట్టు చూసింది.

"సుజా! ఏ కష్టానికైనా సానుభూతి దొరుకుతుంది గానీ .... చిన్న వయస్సులో ఆడపిల్లలకి ఇలాంటి సమస్య వస్తే ఎంతేడుస్తారో! ఆ సంగతి గ్రహించిన క్షణంనించీ ఎంత నరకయాతన పడతారో! .... ముందు వాళ్ళనే ఆదుకోవాలి. వాళ్ళకే ధైర్యం ఇవ్వాలి."

రఘునాథ్‌ని చూస్తున్న కొద్దీ సుజాత మనసంతా సంచలనం ప్రారంభమైంది.

"ముందు ఆ అమ్మాయిని అతని చేతుల్లోంచి బయటికి తీసుకురావాలి సుజా! తర్వాత ఏదో ఒకటి చెయ్యొచ్చు. రాజారావు దగ్గిరికి వెళ్ళి — 'ఆ అమ్మాయిని పుట్టింటికి పంపించేస్తానన్నావు కదా? ముందు మా ఇంటికి పంపించు. ఎబార్షన్ చేయించేసి, ఆరోగ్యం బాగుపడ్డాక, నేనే పంపిస్తాను' అని చెపుతాను. లేకపోతే ఆ అమ్మాయి ఏదో మింగి ప్రాణాలు తీసుకుంటుంది తప్పకుండా!...."

సుజాత నిర్ఘాంతపోతూ అతన్ని అలాగే చూస్తూ వుండిపోయింది.

★ ★ ★

సరిగ్గా .... ఆ లేత వెన్నెలరాత్రి .... శాంతినిచ్చే ఆ చల్లటి వేళ .... నిశ్శబ్దమైన మసక చీకటిగదిలో .... శ్యామల, రాజారావు చేతుల్లో ఆ పది రోజుల్లో అనుభవించనంత ఆనందంతో విశ్రాంతి తీసుకుంటోంది! కానీ, ఆ రోజుల్లో వున్న ఆందోళన లేకుండా! అతను ఆమె తలనిమురుతూ దగ్గిరికి హత్తుకుని ముద్దు పెట్టుకుని పడుకుని వున్నాడు!

హాస్పిటల్‌నించి ఇద్దరూ ఇంటికొచ్చిన తరవాత రాజారావు తిన్నగా గదిలోకి పోయి కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద తల ఆన్చుకున్నాడు. అతనికి భరించలేనంత దుఃఖం వచ్చింది. ఏదన్నా విషంతాగి తెల్లారే పాటికి చచ్చిపోదామనుకున్నాడు. కన్నీళ్ళు పొంగి ప్రవాహం కడుతూంటే ఏ సంకోచమూ లేకుండా ఏడ్చాడు.

అంత దుఃఖంలోనూ ఆలోచనలు మూగపోలేదు.

శ్యామల రైలు ఎక్కివెళ్ళిపోడం ఊహించి కంపించాడు. తరవాత ఆమె ఏమౌతుంది? తనేమౌతాడు? మళ్ళీ ఇంకో పెళ్ళా? తన జీవితంలో ఇంకో స్త్రీ ....?

శ్యామల తన దగ్గిరికి వచ్చిన క్షణంనించీ తన జీవిత విధానమే మారినట్టయింది. ఆమె సంతోషించి నప్పుడు తనకి సంతోషం కలిగింది. ఆమె బాధపడితే తనకి దుఃఖం వచ్చింది. ఆమె చిరునవ్వుకోసం ఆరాటం. ఆమె ప్రసన్నత కోసం తాపత్రయం. ఆమె పెంకితనంలో కూడా తన కెన్నడూ లేని సహనం. తన సర్వస్వమూ ఆమె తప్ప 'తను' అనేది మిగలకుండా పోయింది. తన అంతరంగంలో ప్రేమాంకురాల చలనం జరిగింది, ఆమెని చూశాకే! తన అద్భుత శృంగార జీవితానికి ఆలంబనం అయింది ఆమె ఒక్కతే. అంత అందమైన సిగ్గులో, ఆమె ఆలింగనంలో 'జీవితం ఇంత రమ్యమైనదా?' అని విభ్రాంతి కలిగింది. లోకమే రంగు రంగుల ఇంద్రధనుస్సు అయి వెలిగింది.

మధుర స్వప్నాల మధ్య ఈ భయంకరమైన పీడ కల! ఇంత అసహ్యకరమైన వంచన!

శ్యామల గురించి తనకేమీ తెలియకుండా రోజులు గడిచిపోతే ఎంత బాగుండేది! ఈ రహస్యం రహస్యంలాగా మాసిపోతే, తను శ్యామలతో ఎప్పట్లాగే ఎంత ఆనందంగా కాలం గడిపేవాడు!

అతని మనసంతా ఆక్రమించి, హృదయపు

లోతుల్ని తాకినట్టు అనుభూతి కలిగించిన ఆమె మృదువైన చూపులు, వాటిలో అస్పష్టంగా భయ సంకోచాలు .... నిశ్శబ్దంగా ఊరే కన్నీళ్ళు .... తను అప్రయత్నంగా వాటిని తుడిచి దగ్గిర చేసుకోవటం .... గొప్ప ఆలంబన దొరికినట్టు ఆమె తనని అల్లుకోవటం .... తన అంతరంగంలోంచి మధురమైన పులక రింతలు, ఆకలీ నిద్రలూ గుర్తురాని తన్మయత్వాలు .... అంతే .... అంతే జ్ఞాపకం.

తనకింకా గుర్తువున్న ఆ చూపుల్లో ఏదో దీనత్వం, నిర్మలత్వం తప్ప .... తనని కరుచుకోవటంలో అపార మైన నమ్మకం, ఆశ్రయాన్ని కోరే ఆరాటం తప్ప .... ఎక్కడా నటన, వంచన, తన కసలు గుర్తులేదు.

అర్థరాత్రి దాటిపోయింది. గది అంతా కటిక చీకటి. గుమ్మంలో ఎంతో సేపటినించీ నిలబడివుంది శ్యామల — ఒక్కమాట చెప్పాలని.

అతను గమనించనేలేదు ఆమెని.

రెండడుగులు దగ్గిరికి నడిచింది. చిన్న కంఠంతో, వినయంగా చెప్పుకుంది "....ఒక్కమాట .... చెపుదా మని .... నన్ను .... రేపు పంపించెయ్యండి .... మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి .... కాయితాల మీద సంత కాలు పెడతాను ...."

"......................."

".... మీకు ద్రోహం చేశాను. ఎంత తప్పుచేశానో నాకు తెలుసు .... మొదటి రోజే మీకు చెప్పి దూరంగా వుండాలనుకున్నాను. ఎలా చెప్పాలో చేతకాలేదు. డాక్టరుగారు మంచిపనేచేశారు. .... బాధపడొద్దు మీరు .... అడ్డురాను మీకు .... తప్పకుండా వెళ్ళిపోతాను...."

".... ఎక్కడికి?"

".... మా ఊరే"

"........................"

".... వెళ్ళి? తర్వాత?"

".... తెలీదు .... నావల్ల చాలా తప్పయింది."

"విసిగించకు. వెళ్ళవతలికి."

శ్యామల, గదిలోంచి వెళ్ళిపోయింది.

రాజారావు ఆలోచిస్తూ గంటలు గంటలు గడిపేశాడు. అతని మనసు కేంజరిగిందో అతనికే తెలీలేదు.

శ్యామల గురించి అతని మనసు పరితపించడం ప్రారంభమైంది. ఆమె సాహచర్యంతో గడిపిన మధుర క్షణాల బలం అతనికేదో నూతనశక్తి నిచ్చింది. ఆమె గురించి తన అపార్థాలు, సందేహాలు, అసహ్యాలు వదుల్చుకోవాలనీ, ఆ సాహసానికి తనని తను సంసి ద్ధుణ్ణి చేసుకోవాలనీ, అతనితో ప్రతి అణువూ పెనుగులాడింది.

రాజారావు ఆందోళనతో గదిలోంచి బైటికి వచ్చాడు.

వంటింటి గుమ్మంలో మోకాళ్ళమీద తల ఆన్చు కుని చీకట్లో కూర్చున్న శ్యామల, రాజారావు అడుగుల చప్పుడికి చటుక్కున లేచి నిలబడి తలవంచుకుంది.

రాజారావు దూరంగా నిలబడి ఆమెని చూశాడు. ఆమె దోషిలాగ తన తీర్పుకి ఎదురు చూస్తున్నట్టు కనిపించింది. తను ఉండమంటే ఉంటుంది. వెళ్ళ మంటే వెళ్తుంది. అంత నేరం చేసింది. ఆమెని స్వీక రించినా తిరస్కరించినా, సమాజం ఈ విషయంలో తన పక్షానే వుంటుంది. తన ఇష్టాన్నీ, హక్కుల్నీ కాపాడుతుంది.

రాజారావు చలించిపోయాడు. హృదయంలో పెనుగులాడే స్పందన అతన్ని వివశుణ్ణి చేసింది. స్వరంనిండా ఆత్మీయతతో "శ్యామూ" అన్నాడు!

తలఎత్తి సంభ్రమంగా చూసింది శ్యామల. కన్నీళ్ళు జలజలా జారిపడ్డాయి.

రాజారావు అప్రయత్నంగా అటునడిచి ఆమెని దగ్గిరికి తీసుకోబోయాడు.

"వొద్దు .... నన్ను పంపించెయ్యండి..."

"తప్పు, ఊరుకో!"

శ్యామల అతన్ని కరుచుకుని బావురుమంది.

ఆపదలో మునిగిన మనిషిని ఆదుకోగలిగిన ధీరత్వంతో, గాయపడి విలవిలలాడే పక్షికి సేవచేసే కారుణ్యంతో, అతను ఆమె తల మృదువుగా నిమి రాడు.

"నేనెంతో తప్పు చేశాను. మీ కెంతో ద్రోహం చేశాను. నన్నెందుకు క్షమిస్తారు?" అని ఏడ్చిందామె.

"ఊరుకో! అదంతా ఎందుకు? నిన్నేమీ అడగను. భయపడకు. ఎప్పట్లాగే ఉందాం" అన్నాడతను.

"మీరు అడగకపోయినా నేను చెప్పాలి. నేను చెప్పేదంతా మీరు వినాలి."

ఆ రాత్రే శ్యామల తన విషయమంతా చెప్పింది.

శ్యామల మేనత్తకి ఆస్తి బాగా ఉంది. శ్యామలని తన కొడుక్కి చేసుకోటానికి ఆమె ఇష్టపడలేదు. తల్లి లెక్కలేదనీ, నిన్నే చేసుకుంటాననీ శ్యామల బావ నమ్మకంగా చెపుతూ ఉండేవాడు. సంబంధం స్థిరపడు తుందనే ఆశతో శ్యామల తల్లిదండ్రులుకూడా శ్యామ లని బావతో చనువుగా తిరగనిచ్చారు. శ్యామల మేనత్త, తన అభిప్రాయం వాళ్ళ దగ్గిరా వీళ్ళ దగ్గిరా బయటపెట్టి కొడుక్కి వేరే సంబంధాలు చూడడంతో, రెండు కుటుంబాల మధ్యా స్పర్ధ లెక్కువయ్యాయి. శ్యామల నాయనమ్మ, కూతురికీ, కొడుక్కీ వచ్చిన స్పర్ధలకు బెంగపెట్టుకుని మంచం పట్టింది. కూతురు మీద కోపంతో కొడుకు పక్షంచేరి మనుమరాలికి వేరే సంబంధం చూడమని పోరు మొదలుపెట్టింది. శ్యామల తండ్రి పౌరుషపడి కూతురికి తొందరగా పెళ్ళి చేసేసి బంధువులతో సెభాషనిపించుకుంటానని పంతం పట్టాడు. చివరికి, శ్యామల మేనమామ ప్రయత్నంవల్ల, నిజానికి శ్యామల అందంవల్ల, సంబంధం వెంటనే కుదిరింది.

శ్యామలకి రెండో నెల దాటిపోయింది. బావని వెంటనే రమ్మనీ, చాలా ముఖ్యమైన విషయం చెప్పా లనీ, ఉత్తరాలు రాసింది. అతను ఒక్క సమాధానం కూడా ఇవ్వలేదు. పెళ్ళికి లగ్నం పెట్టేశారు. శ్యామల ఆందోళన ఎక్కువయింది. తన సంగతి ఎవ్వరికీ చెప్పే ధైర్యంలేదు. అది ఇంట్లో ఎవ్వరికీ తెలీదు. రహస్యంగా ఏ మందన్నా తీసుకునే మార్గం లేదు. చాలాసార్లు చచ్చిపోదామనుకుంది. ఏమీ చెయ్యలేని స్థితిలో పెళ్ళి జరిగిపోయింది.

"ఈ విషయం మీకు తప్ప ఎవ్వరికీ తెలియదు. నా పెళ్ళి అని తెలిసినప్పుడు కూడా అతను కదిలి రాలేదు. అప్పటినించీ అతనిమీద నా కెంతో అసహ్యం కలిగింది. నా మీద నాకే చెప్పలేనంత కోపం వచ్చింది. మిమ్మల్ని మోసపుచ్చుతున్నాననే భయంతో నేను ప్రతి రోజూ ఎలా గడుపుతున్నానో చెప్పలేను. ఈ రెండు మాటలూ నమ్మండి. నన్ను మీరేం చేసినా సరే!" అని దీనంగా చూసింది శ్యామల. సిగ్గుపడకుండా, ఏడవ కుండా ధైర్యంగా ఆవేశంగా మాట్లాడింది.

రాజారావుకి ఆమె మాటల్లో ఎక్కడా నటన కన పడలేదు. "అదంతా మరిచిపో శ్యామలా! రేపు డాక్టరు గారి దగ్గరికి వెళ్దాం" అన్నాడు.

శ్యామల నమ్మలేనట్టు చూసింది.

ఆమె మొహమంతా అలుముకున్న కాంతి, చూపుల్లో నిండిన కృతజ్ఞత, తనమీద ఏర్పడ్డ విశ్వాసం చూస్తే, రాజారావుకి తన సంస్కారం మీద తనకే నమ్మకం కలిగింది. మనసులోనే మొకరిల్లాడు డాక్టర్ రఘునాథ్‌కి!

★ ★ ★

రఘునాథ్, ఆలోచనల్లోంచి తేరుకుని "దరి ద్రుడు! ఏం తిట్టిపోస్తున్నాడో! ఆ అమ్మాయి విషయం ఏమైందో రేపు తప్పకుండా చూడాలి సుజా! ఒకసారి అతని దగ్గరికి వెళ్తాను" అన్నాడు.

సుజాత రఘునాథ్‌నే చూస్తూ దీర్ఘంగా ఆలో చిస్తోంది.

వెన్నెల బాగా తగ్గింది. ఆకాశం నక్షత్రాలతో ధగ ధగా మెరుస్తోంది. తోటనిండా విచ్చిన పూలు, వాసన లీనుతున్నాయి. చల్లగాలి సుకుమారంగా, పరవశంగా, తాకుతోంది.

సుజాత, భర్తని భక్తిగా చూస్తూ — "నీ మనసెంతో సున్నితమని తెలిసికూడా ఇన్ని సంవత్సరాలు నిన్ను అర్థం చేసుకోకుండా ఎలా ఉన్నానో నాకే ఆశ్చర్యంగా ఉంది రఘూ!" అంది.

రఘునాథ్ నవ్వి — "పోనీ ఇప్పటికైనా అర్థం చేసుకున్నావా?" అన్నాడు. ఆ మెత్తని నవ్వు, ఎప్పుడూ నమ్మకంగా దొరికే ఆ నిర్మలమైన ప్రేమ, తనకు స్నేహమైన క్షణంనించీ ఈ క్షణం వరకూ ఆతనిలో చూస్తున్న సంస్కార భావాలు, ఆ ప్రశాంత పరిసరాలు — అన్నీ ఆమెకి ఎన్నడూ లేని కొత్త ఆవేశాన్ని కలిగించాయి — "రఘూ! నీకో సంగతి చెప్పాలని పిస్తోంది. చెప్పనా?" అంది.

రఘునాథ్ నవ్వి — "చెప్పటానికి నా పర్మిషన్ అడుగుతున్నావా?" అన్నాడు.

"అవును, అలాంటిదే. నువ్వు శాంతంగా వినాలి. ఈ సంగతి నీకు చెప్పెయ్యాలని ఎన్నిసార్లు బలహీన పడ్డానో! ఎలాగో నిగ్రహించుకున్నాను. ఎక్కడ నీ ప్రేమ పోగొట్టుకుంటానో అన్న భయంతో నా బాధంతా నా

మనసులోనే దాచుకున్నాను."

"ఏమిటి నువ్వు మాట్లాడేది?" రఘునాథ్ ఆతృతగా అన్నాడు.

"నేనుకూడా పన్నెండేళ్ళ కిందట శ్యామలలాగ ఒక భయంకరమైన స్థితిలో పడ్డాను!"

"అంటే?" నిర్ఘాంతపోయాడు.

"నేను మా అత్త దగ్గిరుండి చదువుకునే రోజుల్లో .... నాకు పదిహేను సంవత్సరాలప్పుడు .... ఆవిడ మొగుడు నా విషయంలో పశువులా ప్రవర్తించాడు. నా కప్పుడేమీ తెలీని వయసు. ఎవరికి చెప్పాలన్నా, భయం! ఆ రోజులు గుర్తొస్తే నాకు ఇప్పటికీ గుండెల్లోంచి వణుకు వస్తుంది. కొన్నాళ్ళకి నేనా ఘోరం భరించలేక, తెలివి తెచ్చుకుని, మంకుపట్టు పట్టి అన్నం తినటంకూడా మానేసి మా అమ్మ దగ్గిరికి వచ్చేశాను."

ఆనాటి సుజాతకి నెల తప్పకపోతే, అసలా విషయమంతా ఒక పీడకలలాగ మరిచిపోయేదే. ఆ ఘోరంకూడా జరగటంతో ఆ పిల్ల అందరి దృష్టికీ మహా నీచురాలైంది.

"పాపిష్టిదానా! నా పరువుతీశావే!" అని తండ్రి ఆ లేత ఒళ్ళు చిట్లి రక్తాలు కారేంతవరకూ కొట్టి, శాంత పడ్డాడు. చంపుతానని కంఠం నలిపి ఎవరో అడ్డు పడితే, ఉరితాడు కళ్ళలో మెదిలి, వదిలిపెట్టాడు.

"మమ్మల్ని నవ్వులపాలు చేశావే! నీకా మాత్రం జ్ఞానం లేదటే?" అని తల్లి సన్నగా శోకాలుతీస్తూ శాపనార్థాలు పెట్టింది.

సుజాత కా జ్ఞానం ఎందుకులేదో, ఆ జ్ఞానవంతురాలు ఊహించలేదు. సుజాత చదివే క్లాసు పుస్తకాల్లో పొలాల, స్థలాల వైశాల్యాల్నీ, కిరసనాయిల్ డబ్బాల ఘన పరిమాణాల్నీ కట్టే లెక్కలేగానీ, జీవితమంతా తారసపడే రకరకాల వ్యక్తుల హృదయ వైశాల్యాల్నీ, వారి ఆలోచనల ఘనపరిమాణాల్నీ కనుక్కోగలిగే లెక్కలు లేవు. చరిత్ర పాఠాలనిండా యుద్ధాలూ, సంధులూ, రాజ్యకాంక్షలూ, గుళ్ళమీదా గోపురాల మీదా అలరారే శిల్పకళలూ, దేశ విదేశాల్లో వన్నెకెక్కిన పవిత్ర సంస్కృతుల అపవిత్ర వర్ణనలేగానీ, ఏ భయంకరమైన అర్ధరాత్రో — ఆదమరిచి నిద్రపోయే అమాయకపు ఆడపిల్లలమీద పశుకామంతోపడే నీచుల వర్ణనలుగానీ, రాక్షసబలంతో బలాత్కరించి తల్లుల్నిచేసే దుర్భర సంఘటనలుగానీ, — ఆడపిల్లల్ని ఆత్మరక్షణ కోసం జ్ఞానవంతుల్ని చెయ్యగల ఒక్క అంశమైనా లేదు.

ఆ తల్లిదండ్రులు, అసలు కారకుడైన దుర్మార్గుణ్ణి పన్నెత్తుమాట అనలేదు. తప్పంతా తనదేనని ఆ పిల్ల తిట్లూ, దెబ్బలూ భరించి ఊరుకున్న తరవాత అందరూ శాంతించారు. తరవాత, ఆ తప్పు తుడిచేసుకునే ప్రయత్నాలు, ప్రారంభించారు. అబ్బ! ఎన్ని మందులు మింగించారో! ఆ పిల్ల చచ్చిపోయేటంత జబ్బు చేసిందేగానీ, అనుకున్న పని జరగలేదు. సృష్టికి ఆ బలం ఎక్కడిదో, శిశువు ఆ చిన్ని గర్భకోశాన్ని పట్టుకుని వదల్లేదు.

"చివరికి ఎవరో చెపితే ఆ రాత్రికి రాత్రే ప్రయాణం కట్టించి, నన్నేదో ట్రెయినింగ్‌లో చేర్పిస్తున్నామని అందరికీ చెప్పి హైద్రాబాద్ 'రాధాకిషన్ హోమ్‌కి' తీసుకు వెళ్ళారు" అంది సుజాత.

"ఎందుకు?" అప్రయత్నంగా అడిగాడు రఘునాథ్.

"అక్కడ నాలాంటి దౌర్భాగ్యుల్ని ఆదుకుని రక్షించటానికి ధగే అనే ఒక పుణ్యాత్ముడు ఆ సంస్థ స్థాపించాడు."

పెళ్ళి అనే ముసుగు ఎరగని ప్రకృతి, పెళ్ళిళ్ళు కాని ఆడపిల్లల్ని తల్లుల్నిచేస్తే, ఆ నేరానికి వాళ్ళ జీవితాలు ధ్వంసం కాకూడదనే వాత్సల్యంతో, వారి కన్నీటి బొట్లు తుడిచి సేద తీర్చాలనే కరుణతో, ఆ సంస్థలో రహస్యంగా పురుళ్ళు పోసి ఆ పిల్లల్ని వాళ్ళే తీసుకుని తల్లుల్ని ఇళ్ళకు పంపిస్తారు.

సమాజం విధించే ఆంక్షలకూ, శిక్షలకూ తలలొంచి, ఆ లేత వయసు తల్లులు, చిన్నారి బిడ్డల్ని ఆఖరి ముద్దులు పెట్టుకుని, ఆఖరి చూపులు చూసి, శాశ్వతంగా వీడ్కోలిచ్చి వెళ్ళిపోతారు.

"నేను కూడా అలాగే వచ్చాను రఘూ! వింటున్నావా?" అంది సుజాత భారమౌతున్న కంఠంతో.

వింటున్నాడు రఘునాథ్. విని భరించాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

"ఊఁ, చెప్పు సుజా!"

"హైదరాబాదులో నన్ను తీసికెళ్ళటానికి ఆ హోమే

లేకపోతే నన్నింకా నాటుమందులు తాగించి తాగించి చంపేసే వాళ్ళు రఘూ! చావు తప్పించుకుని బతికి నందుకు సంతోషిస్తున్నా ననుకోకు. ఇప్పుడున్నంత జ్ఞానం, ఆలోచనా అప్పుడే వుంటే, ఎన్ని మందులైనా, ఎలాంటి గరళాలైనా మింగి చచ్చిపోవటానికే సిద్ధపడే దాన్ని కానీ, బిడ్డని కని వదలటానికి ఒప్పుకునేదాన్ని కాదు. ఏ కన్నతల్లికీ దాన్ని మించిన చిత్రహింస వుండదు."

సుజాత కెంతో జుగుప్స కలిగించే దుర్మార్గంతో ఆ బిడ్డ తయారైనా, కడుపులోంచి ఆ బాధ పోగొట్టుకో వాలని అహో రాత్రులూ ఏడ్చినా, వాడు పుట్టగానే హృదయంలోంచి తెరలు తెరలుగా ప్రేమ కూడా పుట్టింది. చీరలు కట్టుకోవడం కూడా చేతగాని వయసులో వాణ్ణి కని, హఠాత్తుగా ఎన్నో సంవత్సరాలు పెద్దదైపోయింది. వాణ్ణి తల్లి, కడుపులోంచి విడదీయా లని ఆదినించీ ఎన్నో ప్రయత్నాలు చేసి, ఓడి, చివరికి వాడు తల్లి, ఒళ్ళోకి రాగానే ఆ ఇద్దర్నీ విడదీశారు. తల్లి ఆ బిడ్డని ఎత్తుకోకూడదు. పాలివ్వకూడదు. ప్రేమ పెంచుకోకూడదు. నిశ్చింతగా ఆ బిడ్డని వదిలేసి, ఇంటికి వెళ్ళి తల్లిదండ్రుల్నీ, బంధువుల్నీ, పెద్దల్నీ అందర్నీ మర్యాదస్తుల్ని చెయ్యాలి. సంఘ శాంతి కాపాడాలి. పవిత్ర హిందూ దేశ సంస్కృతిని రక్షించాలి. ఎందరు లేత తల్లుల గర్భశోకాలతో విలసిల్లుతున్నదో ఈ సంస్కృతి!

"అప్పుడు నా కిలాంటి ఆలోచనలేవీ రాలేదు. వాణ్ణి వదిలి రానని పిచ్చిదానిలాగ ఏడ్చాను. వాడు పడుకుని ఊగే ఉయ్యాల ఇప్పటికీ నా మనసులో అలాగే ఊగుతోంది. ఆ ఒక్క ఉయ్యాలేనా? తల్లు లంతా నాలాగే తన బిడ్డ వూగే ఉయ్యాల చుట్టూ తిరిగి ఏడ్చి ఏడ్చి వెళ్తూ వుంటారు."

ఆ దృశ్యాలు గుర్తొస్తే ఇప్పుడనిపిస్తుంది సుజాతకి — భగే మహోన్నతుడే. కరుణా సముద్రుడే. కానీ పిరికివాడు! ఆయన చేసింది మాత్రం ఏమిటి? సమా జానికి అడుగులకు మడుగులొత్తటమే కదా? ఎలా ఉన్న ఆచారాల్ని అలా ఉంచి వాటిని గౌరవించడమే కదా? — 'మీ విషయాలు రహస్యంగా దాచుకోండి. కొన్నాళ్ళు ఇక్కడ దాక్కోండి. తరవాత మీరుకూడా ఏమీ ఎరగనట్టు గర్వంగా అందరి మధ్యా తిరగండి' అని రహస్యాన్ని రక్షించటమే కదా? ఆ హోమ్‌లో ఉండి వెళ్ళిన వారెవరికీ 'నా కీ బిడ్డ కలగటంలో నా దోషం ఏమీ లేదు' అనే నమ్మకం కలగదు. అందరికీ ఏదో పాపం చేశామనే శంకే. ఉన్నతమైన సమాజ విలువల్లోంచి దిగజారామనే బాధే. మళ్ళీ సమాజంలో ఇమిడి దానికి విధేయులుగా నడుచుకోవాలనే తపనే.

ఒక్కరికీ సమాజాన్ని ధిక్కరించాలనే ఆలోచన లేదు. తన బిడ్డని తనతో తెచ్చి పెంచుకోగలిగే సాహసం లేదు. ఆ శక్తి ఇవ్వని సంస్కర్తలు రహస్యంగా ఒక్క క్షణం కన్నీళ్ళు తుడిచి, జీవితమంతా ఆ బిడ్డ కోసం చెమ్మగిల్లే కళ్ళనెలా ఓదార్చగలరు?

నే నక్కడినించి వచ్చే ఆఖరినాడు నా చేతుల్లో బిడ్డని ఆయాకి ఇచ్చి ఆ ఇంటిమెట్లు దిగుతూన్న క్షణాల్లో నా ఆలోచనల్లో ఇంత ధైర్యం ఉంటే, చుట్టూ మనుషుల అభిప్రాయాల మీద ఇంత నిర్లక్ష్యం ఉంటే, నే నసలు మా వాళ్ళ వెనక తలవంచుకొని ఇంటికొచ్చే దాన్ని కాదు. వచ్చినా వాణ్ణి నా ఒళ్ళో పెట్టుకుని తెచ్చుకునే దాన్ని, వింటున్నావా రఘూ? నువ్వసలు మాట్లాడటం లేదేం?"

రఘునాథ్ చాలా ప్రయత్నంమీద మాట్లాడాడు.

"ఏం లేదు. వింటున్నాను, చెప్పు."

"నేను ఇంటికి వచ్చినా, వాణ్ణి మరిచిపోలేదు. చంటిపిల్లల మీద మమకారం ఎక్కువైంది. నా పెళ్ళి పెద్ద సమస్య అవుతుందేమోనని నన్ను మళ్ళీ చదువులో పెట్టారు. క్లాసులో కూర్చున్నా, రాత్రుళ్ళు పుస్తకాలు ముందేసుకున్నా, మంచంమీద కళ్ళు మూసుకుని పడుకున్నా, ఎప్పుడూ వాణ్ణి గురించే ఆలోచించే దాన్ని. ఇప్పుడు పెద్దవాడై ఉంటాడు. ఆ ముందు వరండా మీద పాకుతూ ఉంటాడు. ఆ వీధి మెట్లమీద పడిపోతాడేమో! ఆయా వాణ్ణి చూసిందో లేదో! ఇప్పుడు తప్పటడుగులు వేసి నడుస్తున్నాడేమో! ఇప్పుడా వరండా మీద గంతులేస్తున్నాడేమో! ఇప్పుడా కాంపౌండంతా పరుగెత్తుతున్నాడేమో! .... ఇలాగే నా ఊహల్లో వాడు నెలలూ, సంవత్సరాలూ పెద్దవాడ య్యాడు. అప్పట్లో నాకు పెళ్ళంటే — భరించలేని ఏవగింపు కలిగేది. ఏ మగవాణ్ణి చూసినా అసహ్యంతో

చాలా దూరంగా మసలాలనిపించేది. నా చదువు పూర్తి చేసుకుని, స్వేచ్ఛ సంపాదించుకుని ఆ పిల్లవాణ్ణి తెచ్చుకుని 'నా కొడుకే' అని అందరికీ చెప్పి, వాణ్ణి ప్రేమతో పెంచుకుంటూ ఒంటరిగా బతకాలని పించేది."

"అవును, తెచ్చుకోవలిసింది" అన్నాడు రఘునాథ్, ఆ మాటల్లో ధ్వనించిన అశాంతి సుజాతకి అర్థంకాలేదు.

సుజాత అతన్ని ఆరాధనతో చూసింది "కానీ, నీ కోసమే, రఘూ! నీ కోసమే నేనా ప్రయత్నం మాను కున్నాను. నీ స్నేహం అప్పట్లో నాకు మానసికంగా చాలా ఆరోగ్యాన్నిచ్చింది. నీకుకూడా దూరంగా ఉండా లని నేనెంత ప్రయత్నించినా, నా మనసు నీ చుట్టూ అల్లుకుని, నిన్ను తలుచుకోగానే నాకేదో కొత్త ఆనందం కలిగేది. నాకే అర్థంకానంత ఆశ్చర్యంగా నువ్వు నా మనసంతా ఆక్రమించుకుని, నా ఆలోచ నల్లో భాగమైపోయావు. నువ్వే లేకపోతే నాకు జీవితమే వ్యర్థమనిపించింది. నీ ప్రేమలో ఏదో దివ్యానందం స్ఫురించి నీ కోసమే ఆరాటపడ్డాను. ఆ పిల్లవాణ్ణి తెచ్చుకోవాలనీ, ఒంటరిగా బతకాలనీ అనుకునేదంతా మార్చుకుని నీతో పెళ్ళికి ఒప్పుకున్నాను. కానీ రఘూ! పిల్లవాడికి మళ్ళీ అన్యాయం చేశానని చాలా సార్లు అనుకుంటున్నాను."

రఘునాథ్ మాట్లాడలేకపోయాడు. ఆమె తన కిచ్చిన స్థానం ఎంత ఉన్నతమైనా. అతని మనసు కలత పడుతోంది. రాజారావే గుర్తొస్తున్నాడు అతనికి.

"రఘూ! నువ్వుగాక ఇంకెవరైనా తారసపడి ఉంటే నేను చాలా అపోహలతో కాలం గడుపుతూ ఉండే దాన్నే! నా కిప్పుడనిపిస్తోంది — ఇంత మనోహరంగా, ఇంత పరవశంగా అనుభవించవలసిన ప్రేమ జీవి తాన్ని ఎంత పతనం చేసుకుంటున్నారు మనుషులు! ఏ జ్ఞానమూ ఎరగని ఒక చిన్న పిల్లమీద దౌర్జన్యంచేసి క్షణికంగా ఆ నీచుడు అనుభవించిన ఆనందం ఏమిటి? ఉన్నత విలువలు తెలిసిన వాళ్ళు జీవితంలో ఎన్నడూ ఏ నీచత్వాలకూ సిద్ధపడరు కదా?"

"అవును .... తరవాతేమైంది?" అన్నాడు రఘునాథ్ అయిష్టమైన ఆసక్తితో.

సుజాత కొంచెం నవ్వింది. "తరవాతేమైందా? మన పెళ్ళయిన తరవాత నాకు నెల తప్పినందుకు మా వాళ్ళంతా ఎంత ఆనందించారో, ఎన్ని వేడుకలు చేశారో, నన్నెంత ముద్దుగా చూశారో తెలుసా?"

మనుషులు సంఘం పేరు పెట్టుకుని తోటి మనుషులకే ఎంత దాస్యం చేస్తారో బాగా అర్థమైంది సుజాతకి. సృష్టిలో ఏ జీవీ తనలాంటి ఇంకో జీవిని చూసి భయపడదు. మనిషి మాత్రం ఇంకో మనిషికి గజగజ వణుకుతాడు. ఇద్దరు మనుషులమధ్య ఊహ కందని అగాధం. ఎవరి దుఃఖం వాళ్ళదే! ఎవరి రహస్యం వాళ్ళదే!

పెళ్ళితో సంబంధం లేకుండా ఒక ఆడపిల్ల, తల్లి అయిందంటే, అది ఎన్ని దుర్మార్గాల వల్ల జరుగు తుందో మనుషులందరికీ తెలుసు. కానీ, అది అర్థం చేసుకునే విషయమే కానట్టు నటిస్తారు. మనుషుల సమస్యలు మనుషులకే ఎందుకర్థంకావు? ఇన్నికోట్ల జీవరాసుల్లో క్రిమికీటకాల కన్నా మనుషులెంత అల్పులు! ఏముంది ఈ జీవితాల్లో? అంతా వంచన. ఆత్మ వంచనా, పరవంచనా! అన్నీ సంకెళ్ళు! కనపడని ఉరితాళ్ళు! కాళ్ళకీ చేతులకీ, నోటికీ మనసుకీ — తోటి మనుషులే వేసి బిగించే బంధాలు! సంఘ శాంతి అనే దొంగపేరుతో, వ్యక్తి జీవితాన్నంతా అశాంతితో నరకం చేస్తారు. ఆలోచించరు. మార్చుకోరు. భరిస్తారు. ఏడుస్తారు. దుఃఖంలో, అబద్ధంలో, రహస్యంలో, బతికేస్తారు.

"ఎవరికి వారే పవిత్రులైతే, సంఘం శాంతితో అలరారుతోంటే, ఆ హోమ్‌నిండా అంతమంది పిల్ల లెలా వచ్చారు రఘూ? ఆ పిల్లలు ...." సుజాత కంఠం కంపించింది.

ఆ హోమ్‌లో పిల్లలు మాత్రమేనా? రోడ్ల పక్కనో, చెట్లకిందనో, అనాథ శరణాలయాల గుమ్మాలలోనో కళ్ళు తెరిచే బిడ్డ లెంతమంది! పవిత్ర గృహాంతర్భాగా లలో రహస్యంగా శ్వాసపీల్చి తక్షణం శాశ్వతంగా శ్వాస వదిలే శిశువుల మాటేమిటి? ఏ శాంతికి, ఏ నీతికి, నిదర్శనం ఈ పిల్లలు?

ఈ పిల్లలంతా — పవిత్ర సంఘ మర్యాదకీ, నీతి సూత్రాలకీ ఆహుతైన పసికందులు! కామాంధుల

రాక్షసత్వానికి ఫలితం అనుభవించే నిర్దోషులు! స్వేచ్ఛ లేని తల్లుల మానసాకాశాల్లో నక్షత్రాల్లా మెరిసే అమాయకులు!

"అమ్మ అంటే ఏమిటని అడుగుతారు వాళ్ళు రఘూ! నా కలల్లో, నా ఆలోచనల్లో ఎప్పుడూ .... ఎప్పుడూ ఆ పిల్లలే."

అక్కడి పిల్లలంతా ఆయాల దయతో పెరిగి సమాజానికి వినయంగా తయారౌతారు. పవిత్రులు మిడిసిపడి వెక్కిరించినప్పుడు నిర్లక్ష్యం చెయ్యగల ఆత్మవిశ్వాసం లేక నీచులమనీ, అల్పులమనీ పరితపి స్తారు. తనని వదిలేసివెళ్ళి పతివ్రత అయిన తల్లికోసం, పుట్టకముందే పారిపోయి నీతిమంతుడైన తండ్రి కోసం, తమ నా స్థితికి తెచ్చిన సమాజ విలువలకోసం, జన్మంతా తపించేంత అజ్ఞానులౌతారు. బయట కుటుంబ సంబంధాలెంత హీనమో అన్ని వందల నిదర్శనాలు తెలిసికూడా విద్యలోగానీ, ఆలోచనల్లో గానీ ఏమీ చైతన్యంలేక అందరికన్నా తామే అవినీతి పరులమనే దుఃఖంలో పడతారు. ఆ చిన్న హృదయాల న్యూనత పోగొట్టి, వారిని గర్వంగా ప్రపంచం ముందు నిలబెట్టే ప్రయత్నాలు లేవక్కడ.

రఘూ! నిన్ను పెళ్ళిచేసుకుని, తల్లినయ్యే హక్కు సంపాదించాను. ఈ కన్నబిడ్డలతోపాటు ఆ దౌర్భా గ్యుణ్ణి కూడా నా మనసంతా నింపుకుని పెంచు తున్నాను. ఒక్కో క్షణంలో నా ఆవేశం నిగ్రహించుకునే శక్తిలేక — 'నాయనా! నేను నీ తల్లిని. నీ కోసం నా కళ్ళు చెమర్చని రోజులేదు. నేను నిన్ను మరిచిపోలేదు' అని ఒక్కసారి వాడికి నమ్మకంగా చెప్పి, వాణ్ణి నా చేతుల మధ్యకి తీసుకోగలిగితేగానీ నా జన్మకి సార్థకత లేదనేంత వెర్రి కలుగుతుంది."

సుజాత కళ్ళు వర్షిస్తున్నాయి. "రఘూ! నా బాధ పంచుకోటానికి నువ్వున్నావనే నమ్మకం లేక ఇంత కాలం ఇదంతా భరించాను. ఎంత మూర్ఖత్వం చూడు! నా మనసులో మాట ఏనాడో చెపితే నా కోరిక తీర్చే వాడివికదా? రఘూ! ఇప్పుడు మనం వాణ్ణి తెచ్చుకో కూడదా?"

అదిరిపడ్డాడు రఘునాథ్. "నీకేం మతి పోయిందా!" అన్నాడు కంగారుగా. వెంటనే మహా ప్రయత్నం మీద సర్దుకుని, "అదెలా కుదురుతుంది సుజా? ఇంతకాలం తరవాత ఆ పిల్లాడు నీ దగ్గిరెలా ఉంటాడు?" అన్నాడు శాంతంగానే.

" 'నీ దగ్గిర' అనకు. 'మన దగ్గిర' అను. మన దగ్గిర ఉండడా? అంత నమ్మకం మనం కలి గించమా?" అని వెర్రి చూపు చూసిందా తల్లి.

"కానీ, మన పిల్లలు .... ఇప్పుడు నువ్వు వాళ్ళకి దూరమైనట్టు .... వాళ్ళెంత గాయపడతారో ఆలో చించాలి ముందు."

"ఎవరు గాయపడ్డా భరించలేను నేను. అలా జరగకుండా చెయ్యలేమా మనం?"

"కానీ, నలుగురూ ఏమనుకుంటారు?" అన బోయి నిగ్రహించుకున్నాడు. మళ్ళీ అదే బలహీనత. మనిషికి మనుషుల్ని చూస్తే భయం! ఇది ఎలా వదుల్చుకోవాలి?

భార్య సంగతి విని రాజారావు పడ్డ బాధ ఎంతో సహజం అనిపిస్తోంది. ఇప్పుడు. అతని సమస్య అతని కెంత భయంకరంగా కనిపించిందో, ఇది తనకు అంతకన్నా భయంకరంగా ఉంది. రాజారావుకి తను చెప్పిన మాటలెన్నో సుళ్ళు తిరుగుతున్నాయి మన సంతా.

జీవితం అంటే హాయిగా, సాఫీగా బ్రతికెయ్యటం కాదన్నాడు తను! చాదస్తాలకు అతీతంగా ప్రవర్తించా లన్నాడు. సంఘ భయంకన్నా నీచమైన బానిసత్వం లేదన్నాడు. అడుగడుగునా స్నేహాలతో, త్యాగాలతో ప్రేమని సాధించమన్నాడు. అన్నీ తను హృదయ పూర్వకంగా నమ్మి చెప్పాడు. స్త్రీలమీద సానుభూతితో గౌరవంతో చెప్పాడు. శ్యామలని తనైతే సునా యాసంగా క్షమిస్తా ననుకున్నాడు. కానీ, అంతకన్నా పసివయసులో దారుణమైన క్షోభ భరించిన సుజాత మీద తన కెంత జాలి కలుగుతోన్నా, జాలితో పరిష్క రించుకో కలిగే సమస్యా ఇది?

తన జీవిత భాగం అనుకున్న తన భార్యకి, పన్నెం డేళ్ళ కొడుకు! అనుక్షణం ఆమెకి వాడిమీదే మమ కారం. వాడి గురించి ఊహలు. వాడిమీదే కలలు. వాడి కోసమే ఆ కళ్ళలో ఆరని కన్నీళ్ళు. వాడి ముందు,

మిగిలిన జీవితమంతా తృణప్రాయం. ఎంత దౌర్భాగ్యం! తన ప్రేమంతా ఎంత వ్యర్థం!

రఘునాథ్ మౌనంలో స్పష్టంగా కనిపిస్తున్న మార్పు సుజాతకి ఆందోళన కలిగించింది. సంకోచిస్తూ "బాధపడుతున్నావా, రఘూ?" అంది.

"లేదు. చాలా సంతోషిస్తున్నాను" అన్నాడు విరక్తిగా నవ్వి.

నిర్ఘాంతపోయింది సుజాత.

అప్పటికి అతని ధోరణి అర్థమైంది.

"పెళ్ళికి ముందు మనం ఎంతో స్నేహంగా ఉన్నాం. ఈ విషయం నా దగ్గిర ఎందుకు దాచాలి?" అన్నాడు.

"నేను చెప్పింది నీ కేమీ అర్థం కాలేదా రఘూ?"

"బాగానే అర్థమైంది — నన్ను నువ్వెంత గాఢంగా నమ్మావో, ఇంతకాలం నువ్వెంత ఆనందంగా నాతో బతికావో చక్కగా అర్థమైంది."

రఘు విషయంలో తన అంచనాలన్నీ తారుమారై, దిగ్భ్రమతో మాట్లాడలేకపోయింది సుజాత.

రఘు, లేచి నించున్నాడు "దయచేసి ఆ పిల్లాడి సంగతి నా దగ్గరెప్పుడూ ఎత్తకు. నేను భరించలేను" అందామనుకున్నాడు. ఏ అనురాగ బలమో, ఏ సంస్కార జ్ఞానమో ఆపింది ఆ మాటల్ని.

"తల నొప్పితో చాలా చికాగ్గా ఉంది. వెళ్ళి పడుకుంటాను" అని గబగబా వెళ్ళిపోయాడు.

స్థాణువైపోయింది సుజాత. ఆమె మనసంతా ఉప్పెనలాగ ఆవేశం పొంగింది. మనుషులంతా ఇంతేనా? రఘుకూడా ....! ఎంత నగ్నసత్యం! తను ఆ బిడ్డని వదిలివచ్చిన నాడే ఈ దౌర్భాగ్యపు తల్లి చచ్చింది. ఇక ఆ బిడ్డకోసం కాదు తను ఏడవాల్సింది. ఇంత కాలం తరవాత తన విశ్వాసాలన్నీ చెల్లాచెదురై పోతున్నాయా? తన రఘు, రాజారావు అంతసామాన్యుడా? — 'రఘూ! ఎప్పట్లాగే మనం పరువు ప్రతిష్ఠలతో గొప్ప వాళ్ళమై బ్రతుకుదాం. నీ కీర్తికీ, హోదాకీ భంగం రానివ్వను. నీ కోసమైనా నేనీ దుఖ్ఖం భరిస్తాను' అని చెప్పి అతనికైనా ఆనందం కలిగించాలా? అతనితో ఘర్షణపడడానికి తనకేం హక్కువుంది? 'నీతో పెళ్ళికి ముందే నేను కని వదిలేసిన పిల్లవాడంటే నీకెందుకు ప్రేమలేదు?' అని అడగాలా? తనకా హక్కువుండదు.

తన మీద అతను దయతలుస్తాడని తను నమ్మింది. కానీ, జాలీ దయా అన్నీ చచ్చిపోయేలాంటి సంగతి ఇది. రఘుని తప్పుపట్టి ఏం న్యాయం?

తన చదువు పూర్తయిన తర్వాత, ఆ బిడ్డని తెచ్చిపెంచుకుంటూ బతకాలని ఎన్నో కలలుకంది. అలా ఎందుకు చెయ్యలేదు? తనకు 'ప్రేమ' కావలసి వచ్చిందా? కన్న తల్లే ఇంత నీచురాలైపోయినప్పుడు, ఆ బిడ్డతో ఏమీ సంబంధంలేని రఘుని నిందించడం ఏం న్యాయం?

సుజాత లేచి రఘు పడుకున్న గదిలోకి, అతని మంచం దగ్గిరికి, వెళ్ళింది "రఘూ!"

"......................................"

"ఒక్క మాట విను.... నీ మీద నాకు నిజంగా కోపంలేదు. ఇందులో తప్పంతా నాదేగానీ నీదికాదు. నా కొడుకు మీద నా ప్రేమంతా అబద్ధం అనిపిస్తోంది ఇప్పుడు. అదే నిజమైతే నేను వాణ్ణి పెంచుకుంటూ ఒంటరిగా వుండిపోయేదాన్ని. అలా చెయ్యలేదంటే నేనేం తల్లిని? తప్పంతా నాదే .... నిన్ను నిందించను.... కానీ ఇప్పటికైనా ఇదంతా నీకు చెప్పేసి మంచిపని చేశాను. నేను చాలా ఉత్తమురాల్ననే భ్రమతో వున్నావు నువ్వు. అది నిజం కాదని చెప్పేశాను. ఇప్పుడు నా మనసు తేలిగ్గా వుంది.

అంతే కాదు రఘూ! ఎప్పుడైనా నువ్వు నా మొహం చూసి 'అలా ఉన్నావేం, ఒంట్లో బాగా లేదా' అని అడిగితే, 'ఏం లేదు, తల నెప్పిగా ఉంది' అనో 'ఇప్పుడే నిద్ర పోయి లేచాను' అనో ఇది వరకు లాగ ఇప్పుడు నోటికొచ్చిన అబద్ధాలు చెప్పక్కరలేదు. ఉన్న నిజం చెప్పెయ్యవచ్చు. 'నా పెద్ద కొడుకు కోసం ఏడుస్తున్నాను' అని చెప్పెయ్యవచ్చు. ఇప్పుడు నాకు ఏడవడానికైనా వీలు దొరికింది. దానికి నువ్వేమీ అనవు కదా? .... రఘూ! నీ మనసు పాడు చేశాను .... అదంతా మరిచిపో! ఈ మాటే చెప్పాలని వచ్చాను .... నీ తప్పేమీలేదు. నిజంగానే అంటున్నాను. నీ తప్పేమీలేదు .... నేనడిగిందానికి ఒప్పుకోవాలంటే నీకు చాలా కష్టమే. నేను అర్థం చేసుకుంటాను."

రఘు, మౌనం వదల్లేదు.

సుజాత వెళ్ళి పోయింది అక్కడినించి.

★ ★ ★

రాజారావూ, శ్యామలా మర్నాడు కూడా డాక్టర్ రఘునాథ్ దగ్గరికి వచ్చారు.

రఘునాథ్ మిగతా పేషెంట్లతో తొందరగా ముగించుకుని ఆ ఇద్దర్నీ లోపలికి పిలిచాడు. ఇద్దరూ చాలా వింతగా, కనిపించారు. రాజారావు ఎప్పట్లాగే నవ్వుతూ ఉన్నాడు. శ్యామల ఏమీ భయపడనట్టు నిశ్చింతగా, ప్రశాంతంగా ఉంది.

రఘునాథ్ నమ్మలేనట్టు ఇద్దర్నీ మార్చి మార్చి చూశాడు.

ఇద్దరూ సోఫాలో చాలా దగ్గరగా కూర్చున్నారు.

రఘునాథ్ ఆత్రంగా చూస్తూ "ఏమిటి రాజారావ్? ఏం నిర్ణయించుకున్నావు?" అన్నాడు.

రాజారావు కిందటిరోజు తన మాటలకూ, కోపానికీ, సిగ్గుపడ్డ వాడిలా నవ్వుతూ — "నిర్ణయించుకోవటాని కేముందండీ? ఈమె ఆరోగ్యం బాగుండేలాగ మందులేమైనా రాసి ఇవ్వండి" అన్నాడు.

డాక్టర్ తెల్లబోయాడు — "ఆరోగ్యం బాగుండేలాగా? అబార్షన్ తర్వాత అదంతా చూసుకోవచ్చు. ఇప్పటికే చాలా ఆలస్యమైంది."

రాజారావు తల అడ్డంగా తిప్పుతూ "ఎందుకు? ఎందు కా పని చెయ్యాలి?" అన్నాడు.

"ఎందుకేమిటీ?" రఘునాథ్ ఆశ్చర్యపడుతూ చూశాడు — "ఆ బిడ్డకి నువ్వు తండ్రినని చెప్పుకుంటావా?"

"ఎవరికి చెప్పుకోవాలి? ఏ బిడ్డకి ఎవరు తండ్రులో అందరూ మనకి విన్నవించుకుంటున్నారా? మే మిద్దరం నిన్న మీ దగ్గరికి రాకుండా ఇంకో డాక్టర్ దగ్గరకి వెళ్ళి ఉంటే, ఈ సరికి మా పరిస్థితి ఇంకో రకంగా ఉండేది. మీరు నాకు జ్ఞానభిక్ష అంటారే అలాంటి భిక్ష పెట్టారు. మీ మాటలతోటే నేను చాలా కదిలి, నన్ను నేను ప్రశ్నించుకుని, కొంచెమైనా ఆలోచించటం నేర్చుకున్నాను.

నా ప్రేమకి పరీక్ష అనుకోమన్నారు మీరు. 'ప్రేమ' అనే మాట నాకు చాలా ఎబ్బెట్టుగా వినపడుతుంది. సినిమాల్లోలాగ, నవలల్లోలాగ, నేను 'ప్రేమించి' పెళ్ళి చేసుకోలేదు. అది ప్రేమో, కాదో నాకు తెలియదు. కానీ, ఈమె నా జీవితంలోకి వస్తుందన్న క్షణంనించీ నాకే అర్థంకాని సంతోషం ఏదో అనుభవించాను. 'పన్నెండు రోజులకేనా?' అని మీరు నన్ను హాస్యం చేశారు. పన్నెండు సంవత్సరాలు కలిసి జీవించిన వాళ్ళయినా ఇలాంటి పరిస్థితి వస్తే నా కన్నా ఎక్కువ న్యాయంగా ప్రవర్తిస్తారనుకోను. మా ఇద్దరి మధ్యా జీవితం ఇంత కొత్తలోనే, నేను తన కోసం ఏమైనా చెయ్యగలనో లేదో అన్న రుజువుతో ప్రారంభమైందంటే, నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ సంగతి వింటే మీరు కూడా చాలా సంతోషపడతారను కున్నాను." డాక్టర్ మొహం పరిశీలిస్తూ ఆగాడు రాజారావు.

రఘునాథ్ తన ఆశ్చర్యాన్ని బయటపడ నివ్వకుండా — "ఎందుకు సంతోషపడనోయ్? చాలా సంతోషం నాక్కూడా. అసలు మీ అభిప్రాయం నా కర్థం కాలేదు కదా? నీ రక్త సంబంధంలేని బిడ్డని నువ్వు నిజంగా ప్రేమించగలవో లేదో బాగా ఆలోచించుకున్నావా? ఇప్పుడేదో ఉన్నతంగా ప్రవర్తించాలని ఆవేశపడి ఆ బిడ్డకి జన్మనిస్తే తరవాత జీవితమంతా...." అని హెచ్చరించబోయాడు.

"మీరు నన్ను శంకిస్తారని నాకు తెలుసు. కాని, నేనేదో ఉన్నతంగా ప్రవర్తించాలని ఇలా నిర్ణయించుకోలేదు. ఆలోచిస్తే నాకిది చాలా సహజంగా కనిపిస్తోంది. నా రక్త సంబంధంకాదు కాబట్టి, ఇప్పుడు శ్యామల కడుపులో పెరుగుతోన్న బిడ్డని చంపించి, రేపు మళ్ళీ నా రక్తంతో ఏర్పడ్డాక దాన్ని రక్షించుకునే ప్రయత్నాలు నేనే చెయ్యాలి. ఎంత నీచం! అలా జరిగిన తరవాత నాకు నేనే ఎంతో వికృతంగా కనపడతాను. మీ రన్నారు కదా, 'ఈ తండ్రులంతా ఎంత నిజం తండ్రుల'ని? అన్ని సంబంధాలూ అలా వుండవు. అక్కడక్కడా ఇలాంటి మోసాలు జరుగుతాయని మీరే కదా అన్నారు? ఆడవాళ్ళ దోషం లేనప్పుడు, ఆ తల్లీ బిడ్డల్ని ఎందుకు శిక్షించాలి? ఈ బిడ్డ నాకు పుట్టిన బిడ్డ కాకపోతే మాత్రం మానవజాతికి జరిగే లోపం ఏమిటి?

మన తల్లులంతా పెళ్ళిళ్ళు చేసుకున్నాక మనల్ని కని సంఘం దృష్టిలో మనల్ని మర్యాదస్తుల్ని చేశారు. మనమే ఏ పెళ్ళికాని తల్లికైనా పుట్టి ఉంటే సంఘానికి వెలివడ్డ వాళ్ళం కావలసిందే కదా? ఇంత ఆలోచించ గలిగిన వాళ్ళం మన జీవితాల్లో మనం నమ్మే విధంగా ఏమీ చెయ్యలేమా?"

"ఆలోచించినంత తేలిక అనుకుంటున్నావా ఆచ రించటం? నేను సంఘం దృష్టితో అడగటం లేదు. ఆ బిడ్డకు తండ్రి నువ్వు కాదనుకుంటే నీకు మానసికంగా క్షోభ కలగదా? అనవసరంగా ఎందుకా పరిస్థితి నీకు? అబార్షన్ చేసేస్తే గతం అంతా పోతుందికదా?"

రాజారావు నవ్వి — "మీరు నన్ను పరీక్ష చెయ్య డానికే ఇన్ని ప్రశ్నలు వేస్తున్నారు. మీకు తెలియందే ముంది డాక్టరుగారూ? మనుషులేనా తండ్రుల య్యేది? తండ్రి కావటమే గౌరవం అయితే, మనం దున్నపోతుల్నీ, ఆంబోతుల్నీ, నక్కల్నీ, కుక్కల్నీ, తండ్రి అయ్యే ప్రతి మగజీవినీ గౌరవించాలి. నా తండ్రి తాగుబోతై నన్ను వదిలేస్తే, మా మేనమామ తన బిడ్డల్లో ఒక బిడ్డలాగ నన్ను పెంచాడు. రక్తసంబం ధంతో తండ్రినయ్యేకన్నా, ప్రేమతో వాత్సల్యంతో ఆ బిడ్డ మనసులో తండ్రి స్థానం సంపాదించటం ఉన్నతం కదా? భార్యల శీలానికి కొత్త అర్థాలు చెప్పుకోవాలన్నారు మీరు. అలాగే తల్లుల దోషంలేని సందర్భాల్లో, తండ్రుల సంబంధానికి కూడా కొత్త అర్థాలు చెప్పుకోవచ్చు కదా?"

డాక్టర్ తన దిగ్భ్రాంతిని అణుచుకుంటూ శ్యామల వేపు చూసి — "నీకుకూడా ఎబార్షన్ ఇష్టంలేదా?" అన్నాడు.

రాజారావు కలగజేసుకుని — "నేను బాధపడతా ననే సంకోచమో, నలుగురూ వెక్కిరిస్తారనే భయమో లేకపోతే, ఏ తల్లికయినా బిడ్డని చంపుకోవటం ఎందు కిష్టమవుతుంది? ఎబార్షన్ తనకు ఇష్టమేనని శ్యామల చెప్పినా నమ్మటానికి వీల్లేదు" అన్నాడు.

శ్యామల ప్రశాంతంగా చూస్తూ — "అతను నన్ను మోసం చేశాడని అర్థమైనాక అతనిమీద అసహ్యంతో .... ఇదంతా వదుల్చుకోవాలని ప్రతి క్షణం ఆరాట పడ్డాను డాక్టర్‌గారూ! కానీ .... ఈయన .... ఈయన మీద నా కిప్పుడా సందేహం లేదు. ఈయన మన సెంతో గొప్పది. ఈ బిడ్డ పుట్టినా మేమిద్దరం సంతో షంగా పెంచగలం. ఈ బిడ్డకి ఈయన కాకపోతే ఇంకెవరు తండ్రవుతారు?" అంది.

రఘునాథ్ నిశ్చేష్టుడైనట్టు కూర్చున్నాడు. కొంత సేపటికి తేరుకుని — "నిజమే రాజారావ్! మీ ఆలోచ నంతా మంచిదే. మిమ్మల్ని నాకన్నా అర్థం చేసుకునే వాళ్ళు ఉండరు. కానీ పదిమందిమధ్యా ఉన్నాం. బంధువులు, స్నేహితులు, ఇంకా ఎందరో తెలిసిన వాళ్ళు, తెలియని వాళ్ళు, .... వాళ్ళంతా మీ గురించి వింతగా మాట్లాడుకుంటారని తెలిస్తే?"

"మాట్లాడుకోనివ్వండి. వాటి లెక్క మాకేముంది? బంధువుల కన్నా, స్నేహితుల కన్నా శ్యామల నాకు దగ్గిర వ్యక్తి అయింది. నా జీవితంలో భాగం అయింది. ఆమె మనసుకో, ఆరోగ్యానికో హానికలిగే పని నేనెట్లా చేస్తాను?"

రాజారావుమీద రఘునాథ్‌కి చాలా గౌరవం కలిగింది. పెన్ను తీసి ప్రిస్క్రిప్షన్ రాశాడు. అది రాజారావుకిస్తూ — "ఇవి రెగ్యులర్‌గా వాడటం మంచిది. ప్రతి నెలా చెకప్ చేయించుకోవాలి. పాలూ, పళ్ళూ, ఆకుకూరలూ ఎక్కువగా వాడాలి. రోజూ సాయంత్రం వేళప్పుడు కొంతదూరం నడవటం మంచిది. తరవాత మళ్ళీ చూసి ఏమైనా అవసరమైతే చెపుతాను" అన్నాడు.

రాజారావు ఆ చీటీ అందుకుని డాక్టర్‌కి నమ స్కారం చేశాడు చిరునవ్వుతో.

శ్యామల కూడా లేచి నిలబడి వినయంగా, భక్తిగా, చేతులు జోడించింది కళ్ళుమూసి.

శ్యామల వచ్చేవరకూ నిలబడి రాజారావు ఆమె చెయ్యి అందుకున్నాడు. ఇద్దరూ నెమ్మదిగా నడిచారు. మెట్ల దగ్గిర ఆమె జాగ్రత్తగా దిగడానికి సాయం చేశాడతను. ఆమె చెయ్యి విడవకుండా ఆసరాగా పట్టుకున్నాడతను. ఇద్దరూ ఒక్కటిగా నడుస్తున్నారు.

ఆమె సమస్త దుఃఖాల్నీ మరిపించిన అభయ హస్తం అది! యుగ యుగాల చైతన్యరహిత సంఘం మీద ధిక్కారం అది! కామానికీ, ఆకర్షణకీ అతీతమైన అంతరాత్మల స్నేహం అది! మానవ బలహీనత

లెన్నిటినో కాలదన్నిన మహోన్నతాదర్శం అది! ద్వేషాల్నీ, మూఢత్వాల్ని జయించిన అంతరంగాల ఐక్యం అది!

ఒక్క క్షణం .... అలాంటి ఔన్నత్యంలో ఒక్క క్షణం జీవిస్తే, జీవితమంతా ఎంత ధన్యం! రఘునాథ్ కుర్చీలో కూర్చుని పెన్ను తీశాడు.

"నా ప్రియమైన సుజా!

క్షమిస్తావా నన్ను? నా అహంకారం పటాపంచలై, నేను ఎంత అల్పుణ్ణో నాకే స్పష్టమై, నీ క్షమ కోసం ప్రార్థిస్తున్నాను.

మన బిడ్డని మనం తెచ్చుకుందాం. ఆ చిన్న హృదయంలో తల్లి తండ్రులుగా మనం చోటు చేసుకుందాం. ఆ పవిత్ర స్థానంతో మన జన్మలు పావనం చేసుకుందాం.

నాలో సంఘర్షణకీ, పోరాటానికి ఒక రూపం వచ్చింది. ఇది నాకే సిగ్గు కలిగించేంత ఆలస్యంగా వచ్చింది.

వాళ్ళ అన్న వస్తాడని వాడి తమ్ముడికీ, చెల్లిలికీ చెప్పు! మనం అందరం వాణ్ణి ఆహ్వానించటానికి త్వరలో బయల్దేరదాం. నీ కళ్ళల్లో ఎప్పుడూ శాంతి కోసం, చిరునవ్వుకోసం పరితపించే.

ఎప్పటికీ నీ రఘు

[22-3-72 'ఆంధ్రప్రభ' వారపత్రికలో] ★

## ఈ కథ గురించి:

కొన్ని ఇతర కథల్లో అక్కడక్కడా పొరపాటు భావాలు వున్నట్టే, ఈ కథలోనూ వున్నాయి. దీని మీద గతంలోనే 'కొత్త ముందుమాట'లో రాశాను. అలాంటి విషయం ఒకటి ఇక్కడ క్లుప్తంగా ఇస్తున్నాను.

డాక్టరు రఘు, శ్యామల గురించి, రాజారావుతో వాదిస్తూ — "... ఏ నీతికైనా, ఏ నియమానికైనా నిలకడెక్కడుంది? ఇది తప్పనీ అది ఒప్పనీ నిర్దేశించే శక్తి ఏ సిద్ధాంతానికీ లేదు" అంటాడు. అంటే, 'పాత నీతుల్ని లెక్క చెయ్యకు. ఆమె పరిస్థితి ఏమిటో అర్థం చేసుకో' అని చెప్పాలని డాక్టర్ అభిప్రాయం. దానికోసం చెప్పవలసింది ఆ రకంగా కాదు. 'ఇది తప్పనీ, అది ఒప్పనీ' చెప్పగలిగే శక్తి దేనికీ వుండదా? దీని అర్థం అసలు తప్పొప్పులే వుండవు — అని! ఇలా చెప్పడం వల్లే ఇది తప్పు.

ఏ కాలాన్ని అయినా తీసుకుందాం. ఆ కాలంలో, అమలులో వున్న సాంప్రదాయాలు కొన్ని వుంటాయి. అప్పటికి, అభివృద్ధికరంగా వుండే భావాలూ, అభివృద్ధి నిరోధకంగా వుండే భావాలూ కూడా వుంటాయి. ఆ దశనే తీసుకుంటే, అక్కడ మంచీ చెడ్డా రెండూ వుంటాయి. ఆ కాలాన్నిబట్టి, ఆ సందర్భాన్ని బట్టి, ఆ విషయాన్ని బట్టి, 'ఇది మంచీ, అది చెడ్డా' అని చాలా ఖచ్చితంగా నిర్ణయించగలం. ఆ మంచి చెడ్డల్ని అందరూ ఒకే రకంగా పాటిస్తారా లేదా అనేది వేరే సంగతి.

నీతి నియమాలకు 'నిలకడ' లేకపోవచ్చు. ఒక నీతి ఎల్లకాలమూ స్థిరంగా వుండకపోవచ్చు. అయినా, ఒక కాలాన్ని తీసుకుంటే, అక్కడ నీతీ అవినీతీ వుంటాయి. అక్కడ మంచీ చెడ్డా వుంటాయి.

శ్రమదోపిడీ జరుగుతూ వున్న సమాజంలో, దోపిడీ వర్గానికి 'మంచి' అయినది, శ్రామిక వర్గానికి మంచి కాదు. కానీ, ఆ వర్గాల మధ్య జరిగే 'విషయాన్ని' చూస్తే, ఆ విషయంలోనే మంచిచెడ్డలూ, న్యాయాన్యాయాలూ వుంటాయి. దాన్ని బట్టి, 'ఇది మంచీ, అది చెడ్డా' అని చెప్పడం పూర్తిగా సాధ్యం. పైగా అవి ఒక కాలానికే కాదు. సర్వకాలాలకూ వర్తించే మంచి చెడ్డలుగా వుంటాయి. శ్రమని దోచడం ఏ కాలంలో అయినా చెడ్డే. కుల భేదాల్ని పాటించడం, ఏ కాలంలో అయినా చెడ్డే. ఈ రకంగా, మంచిచెడ్డల్ని, శాశ్వితంగా నిర్ధారించడం కూడా సాధ్యమే. కాబట్టి 'తప్పొప్పుల్ని నిర్ధారించే శక్తి ఏ సిద్ధాంతానికీ లేదు' అనే పద్ధతిలో డాక్టరు మాట్లాడడం తప్పు. రాజారావుకి బోధించాలంటే ఇంకో రకంగా చెప్పాలి. 'తప్పొప్పులు వుండవు' అనో, 'అవి అనవసరం' అనో, కాదు. ఇలాంటి వాటిని ఉదాహరణలతో అయితేనే సరిగా అర్థం చేసుకోగలం.

8-6-2004.